వ్యాసం

# పౌర హక్కుల ఉద్యమ స్వభావం, పరిధి

## (7వ రాష్ట్ర మహాసభ ఆమోదించిన ప్రధాన కార్యదర్శి నివేదిక)

కల్లోల జిల్లా అని పత్రికలు మారు పేరు పెట్టిన కరీంనగర్‌లో జరుగుతున్న 7వ రాష్ట్ర మహాసభలకు హజరైన ప్రతినిధులకు, సౌహార్ద్రప్రతినిధులకు రాష్ట్ర కార్యవర్గం తరఫున ఆహ్వానం పలుకుతున్నాను. విప్లవోద్యమాన్ని అణచడం అనే పేరుమీద ప్రజానీకం పైన దమనకాండ ప్రయోగించడం ప్రారంభమైన నాటి నుండి శ్రీకాకుళం తరువాత మళ్ళీ అంత నిర్బంధాన్ని అనుభవించింది కరీంనగర్ జిల్లాయే! ఎమర్జెన్సీ తరువాత కాలములో ఎక్కువగా ఎన్‌కౌంటర్‌లు జరిగింది ఈ జిల్లాలోనే. ఎక్కువసంఖ్యలో రాజకీయ కార్యకర్తల ఇండ్లను, పొలాలను, పోలీసులు ధ్వంసం చేసింది ఈ జిల్లాలోనే. ఒక దశలో గ్రామ గ్రామాన పోలీస్ క్యాంపులు పెట్టి జనాన్ని వందల సంఖ్యలో పోగేసి చావకొట్టి జైలుకు పంపించారు. ఇప్పుడు మనము ఇక్కడ సమావేశం అయివుండగా మన చుట్టూ వున్న, గ్రామాల మీద కేంద్ర రిజర్వు పోలీసులు, ఇండో - టిబెటిన్ సరిహద్దు పోలీసులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, మామూలు ఖాకీ బట్టల పోలీసులు దాడులు చేస్తున్నారు, అరెస్టులు చేస్తున్నారు, లాకప్‌లలో జనానికి రోకలిబండలు ఎక్కిస్తున్నారు, కరెంట్ షాక్ పెడుతున్నారు.

ఈ ఆధునిక యమలోకానికి కేంద్రమైన కరీంనగర్‌లో మన రాష్ట్ర మహాసభలు జరుపుకోవడం ఉచితంగా ఉంటుందని భావించి ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించుకొన్నాము. చాలా సందిగ్ధ పరిస్థితులలో రెండు దినాలుగా సభలు జరుపుకుంటున్నాము. ప్రస్తుతం పౌరహక్కులకు సంబంధించి దేశంలో నెలకొని వున్న పరిస్థితిని, మన కర్తవ్యాలనూ, ఇప్పటివరకు మనం చేసిన పనినీ, చేయలేకపోయిన పనినీ, నిర్మాణ సమస్యలను వివరంగా చర్చించుకొని మన ఉద్యమాన్ని ముందుకు తీసుకొనిపోవడం మన కర్తవ్యము.

గత రాష్ట్ర మహాసభలలో పౌరహక్కుల అవగాహనలో వచ్చిన విస్తృతిని చర్చించాము. ప్రపంచములో ఏ దేశములోనయినా పౌరహక్కుల ఉద్యమం, రాజకీయ ఉద్యమాల అణచివేతకు ప్రతిస్పందనగా పుట్టింది. అయితే ఆ తరువాత తన పరిధిని విస్తరించుకొని తనదంటూ ఒక అవగాహనను, ఒక స్వంత అస్తిత్వాన్ని సాధించుకుంది. ఇవ్వాళ అంతర్జాతీయంగానే స్థూలంగా అందరు అంగీకరించే ఒక పౌరహక్కుల దృక్పథం వుంది. అందులో అభిప్రాయభేదాలు - ముఖ్యంగా రాజకీయ ఉద్యమాలు చేపట్టే హింసాత్మక చర్యలకు సంబంధించినది - కొన్ని ఉన్నా విభేదాల కంటే అంగీకారమే ఇవ్వాళ ప్రధాన విషయంగా ఉంది.

పాశ్చాత్య దేశాలలోనూ, మూడవ ప్రపంచ దేశాలలోనూ వామ పక్ష ఉద్యమాల అణిచివేత నుండీ లేక ప్రజాతంత్ర ఉద్యమాల అణచివేత నుండీ పౌర హక్కుల సంఘాలు పుట్టాయి. తూర్పు యూరప్, సోవియట్ యూనియన్ వంటి దేశాలలో వామపక్ష సిద్ధాంతం పేరుమీద నడుస్తున్న పాలన పట్ల అసమ్మతి తెలిపిన వారిపైన ప్రభుత్వాలు ప్రయోగించిన అణచివేత నుండి పౌర హక్కుల ఉద్యమాలు పుట్టాయి. ఈ ఉద్యమాలు తమ లక్ష్యానికి పౌర హక్కులు, ప్రజాతంత్ర హక్కులు, మానవ హక్కులు మొదలైన పేర్లలో ఏది పెట్టుకున్నా అందరు ఆమోదించే కొన్ని కనీస సూత్రాలు ఉన్నాయి. రాజ్యాంగం, చట్టం లేక ఆధునిక, నాగరికతా భావనా ఆమోదించే ఏ హక్కును కూడా పరిపాలన యంత్రాంగం అతిక్రమించడానికి వీలులేదు. ఆ హక్కులకు ఏవైనా పరిమితులు పెట్టినా అది హేతు బద్ధంగా వుండాలి, నిష్పాక్షికంగా ఉండాలి, సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉండాలి. ఈ హక్కులలో వాక్ సభా స్వాతంత్ర్యాలు, అభిప్రాయ స్వేచ్ఛ, సహజన్యాయసూత్రాలకు అనుగుణమయిన నేరవిచారణ స్మృతి, మానవీయమయిన శిక్షాస్మృతి ప్రధానమయినవి. పాశ్చాత్య బూర్జువా ప్రజాతంత్ర విప్లవాల నుండి పుట్టిన ఈ అవగాహనకు కార్మిక రైతాంగ ఉద్యమాలు, మహిళా ఉద్యమం, కుల వ్యతిరేక ఉద్యమం, జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమాలు మరొక పార్శ్వాన్ని చేర్చాయి. మనిషి వ్యక్తిత్వం నిండుగా స్వేచ్ఛగా స్వతంత్రంగా ఎదగకుండా ఆపేది ఏదయినా అణచివేతే. రాజ్యాంగ యంత్రమే కాక సామాజిక ఆర్థిక వ్యవస్థ ఈ రకమైన అణచివేతకు పాల్పడుతుంది. ఈ అణచివేతను వ్యతిరేకించి మనుషులు సమగ్రమయిన మానవులుగా ఎదగగల పరిస్థితులకోసం కృషిచేయడమూ పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యమే అవుతుంది. ఆ పరిస్థితులు ఏ విధంగా ఏర్పడతాయని చర్చించేటప్పుడు రాజకీయ విభేదాలకు తావు ఉంటుంది. రకరకాల రాజకీయ అభిప్రాయాలు, పంథాలు ఉంటాయి. వాటి తప్పొప్పులను మంచి చెడులనూ నిర్ణయించడం పౌరహక్కుల ఉద్యమానికి సాధ్యం కాదు. అణచివేతను వ్యతిరేకించి పీడితుల హక్కుల పక్షాననిలబబడడం వరకే పౌరహక్కుల ఉద్యమం పరిధి.

ఆయా దేశ కాల పరిస్థితులను బట్టి ఒక్కొక్క పౌర హక్కుల

సంఘం పై అంశాలలో ఒక్కొక్క దానికి ప్రాముఖ్యత ఇస్తుంది. 'ఆకలి దశాబ్దంగా' పేరు గాంచిన 1930లలో బ్రిటన్‌లో ఏర్పడిన జాతీయ పౌరహక్కుల సమితి ఆనాటి నుండి ఈనాటి వరకు వాక్‌సభా స్వాతంత్ర్యాలకు సమావేశ స్వేచ్ఛకూ ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ ఉంది. 20 వ శతాబ్దం 2వ దశకంలో పుట్టిన అమెరికా పౌర హక్కుల సంఘం చట్టబద్ధ పాలనకు, న్యాయసూత్రాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. అమ్నెస్టీ ఇంటర్‌నేషనల్ అంతర్జాతీయ హక్కుల ప్రకటనకూ ఒడంబడికలకూ అనుగుణమయిన న్యాయసూత్రాలకూ పరిపాలనా సరళికి ప్రాధాన్యం ఇస్తుంది. తూర్పు యూరప్ దేశాలకు చెందిన జెకస్లోవేకియా, చార్టర్ ఆఫ్ 77 వంటి సంస్థలు అసమ్మతి హక్కుకూ, రాజకీయ స్వేచ్ఛకూ ప్రాధాన్యం ఇస్తాయి. మనదేశంలోని పౌర హక్కుల సంఘాలన్నీ కూడా చట్టబద్ధపాలనకు, ప్రజల పోరాడే హక్కుకు ప్రాధాన్యం ఇచ్చేవి. ఇప్పుడిప్పుడు సామాజిక వ్యవస్థలోని అణచివేతను కూడా ప్రధాన పౌరహక్కుల సమస్యగా గుర్తిస్తూ ఉన్నాయి.

హక్కులు అనేవి చట్టంలో పుట్టలేదు, రాజ్యాంగంలో పుట్టలేదు. అవి చరిత్రలో పుట్టాయి. చరిత్రలో పుట్టిన హక్కులను ఏమేరకైతే చట్టము, రాజ్యాంగము గుర్తిస్తాయో, ఆ మేరకు అవి ప్రజాస్వామికంగా ఉన్నాయి అంటాము. చరిత్రలో మనుషులు తమ మనుగడను, జీవనాన్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, నిండయినవ్యక్తిత్వ వికాసాన్ని ఆటంకపరిచే సామాజిక రాజకీయ వ్యవస్థలకు వ్యతిరేకంగా అనాదిగా పోరాటం చేస్తున్నారు. రకరకాల తాత్విక దృక్పథాలతో, రాజకీయ సిద్ధాంతాలతో, పోరాట వ్యూహాలతో ఉద్యమించారు. సంఘటితంగా, అసంఘటితంగా, వ్యవస్థితంగా, అవ్యవస్థితంగా పోరాటాలు నడిచాయి. ఈ పోరాటాల విజయాల నుండి హక్కులు, విలువలు, ఆదర్శాలు పుట్టాయి. ఇవి ఒక స్థాయి దాకా ప్రజల చైతన్యంతో మట్టుకే ఉంటాయి. ఆ స్థాయి దాటిన తరువాత పాలకులకు మనస్ఫూర్తిగా ఇష్టం ఉన్నా లేకున్నా చట్టంలో రాజ్యాంగవ్యుంలో ఆచార వ్యవహారాలలో గుర్తింపు పొందుతాయి. హక్కులు ఇవ్వడం, ప్రజాతంత్ర విలువలకు గుర్తింపు ఇవ్వడం పాలకులకూ, పెత్తందారీ వర్గాలకూ ఎప్పుడూ ఇష్టం ఉండదు. కాబట్టి అనేక మినహాయింపులతో, పరిమితులతో వాటిని గుర్తిస్తారు. అనేక ఆంక్షలతో శాసనబద్ధం చేస్తారు.

చరిత్రలో ప్రజల పోరాటాల నుండి పుట్టిన హక్కులకు విస్తృతమైన ప్రచారం ఇవ్వడం, అవి ఒకరు ఇచ్చిన హక్కు కావనీ, దేశ దేశాల ప్రజలు పోరాటం చేసి సాధించుకున్నవనీ, నాగరికత ప్రజాస్వామ్యం అనే భావనలలో ప్రజలు నిర్వచించుకున్నారని వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయడం, శాసనములో గుర్తింపు పొందిన హక్కుల అమలు కోసం, వాటిమీద ఆంక్షల సడలింపు కోసం కృషి చేయడం, ఇప్పటికీ శాసనబద్ధంగాని హక్కులను శాసనబద్ధం చేయడం, వాటి కోసం ఉద్యమించడం ఇవీ పౌరహక్కుల ఉద్యమం ప్రధానకర్తవ్యాలు.

ఈ కర్తవ్యాన్ని నిర్వహించడానికి పౌరహక్కుల ఉద్యమం మూడు సాధనాలను ప్రయోగిస్తుంది. 1. సభలు సమావేశాలు ప్రచురణల ద్వారా ప్రచారం చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేయడం, ప్రభుత్వం మెడలు వంచే ప్రజాభిప్రాయాన్ని తయారుచేయడం. 2. శాసన సభల మీద పరిపాలనయంత్రాంగం మీద ఒత్తిడి తీసుకొని వచ్చి ప్రజాను కూలమయిన శాసనాల రూపకల్పనకూ, అమలుకూ దోహదం చేయడం. 3. కోర్టులలో కేసులు వేసి ప్రజానుకూలమయిన చట్టాలు అమలు అయ్యేటట్లు చూడడం, చట్టాలకూ విస్తృత వ్యాఖ్యానం ఇప్పించడం ద్వారా వాటిని ప్రజానుకూలంగా మలచడం, పూర్తిగా అప్రజాస్వామిక మయిన చట్టాలను కొట్టివేయించడం.

ఈ సాధనాలలో దేనిని ఎక్కువగా ఉపయోగిస్తామనేది కూడా ఆయా దేశాల పరిస్థితిని బట్టి ఉంటుంది. పాశ్చాత్యా దేశాల పౌరహక్కుల సంఘాలు ఇందులో రెండవ, మూడవ సాధనాన్ని ఎక్కువగా ఉపయోగించుకొంటాయి. కోర్టులలో కేసులు విస్తృతంగా వేయడం, శాసనసభల మీద ఒత్తిడి చేసి చట్టాలు జారిచేయించడం, పరిపాలనా యంత్రాంగంతో సత్సంబంధాలు పెట్టుకొని అవి అమలు అయ్యేలాగ చూడడం, ఆదేశాల పౌరహక్కుల సంస్థల ప్రధాన కార్యక్రమం. మనం ఎక్కువగా మొదటి సాధనాన్ని - ప్రచారాన్నీ, ఆందోళనను - కొంత వరకు మూడవ సాధనాన్ని వాడుకొంటున్నాము.

హక్కులకు చారిత్రకంగా సంక్రమించిన చైతన్యం ప్రమాణం గానీ రాజ్యాంగం కాదు. రాజ్యాంగాన్నీ ఆ చైతన్యం ప్రమాణంగా అంచనా కడతాము. రాజ్యాంగాన్ని, చట్టాన్ని మొత్తంగా బూటకమని కొట్టివేయడం పౌరహక్కుల దృక్పథంకాదు. రాజ్యాంగంలోనూ చట్టంలోనూ ప్రజావ్యతిరేక అంశాలే ప్రధానమయినా, ప్రజానుకూలమయినవీ ఉంటాయి. ప్రజానుకూలమయినవి ప్రజాపోరాటాల నుండి పుట్టాయి. అణచివేత ఎప్పుడూ ఏకపక్షంగా వుండదు. దానికి ప్రతిఘటన వుంటుంది. ఆ ప్రతిఘటన సామాజికంగా రాజకీయంగా విజయం సాధించినపుడు దానికి గుర్తింపుగా రాజ్యాంగములోను, చట్టములోనూ ఎంతో కొంత మార్పు వస్తుంది. ఆ మార్పును చాలా పరిమితం చేయాలని పెత్తందారీ శక్తులు ప్రయత్నం చేస్తాయి. వీలయినంత విస్తృతం చేయాలనీ పౌరహక్కుల ఉద్యమం ప్రయత్నం చేస్తుంది.

భారత రాజ్యాంగంలోనూ, చట్టంలోనూ, వున్న ప్రజాస్వామిక విలువలు, హక్కులు, ఆదర్శాల వెనుక భారత ప్రజల జాతీయపోరాటం, సామాజిక సంస్కరణ ఉద్యమాలూ, సామాజిక విప్లవపోరాటాలు, కార్మిక రైతాంగపోరాటాలు, గిరిజన పోరాటాలు వున్నాయి. ఇవేకాక ఇతర దేశాల ప్రజాపోరాటాల ఫలితంగా అంతర్జాతీయంగా ఆమోదం పొందిన

విలువలు ఉన్నాయి. భారత రాజ్యాంగాన్ని తయారుచేసే నాటికి ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనను ఆమోదించింది. ఆ ప్రకటనలో ఒక్క ఆస్తి హక్కు మినహాయిస్తే తక్కినవన్నీ కలిసి అంతర్జాతీయంగా మధ్యయుగాల అంతం నుండి ప్రజలు పోరాటం చేసి సాధించుకున్న అన్ని హక్కుల క్రోడీకరణ అవుతుంది. దాని ప్రభావం రాజ్యాంగం మీద వుంది.

కొన్ని హక్కులు పాశ్చాత్య బూర్జువా ప్రజాతంత్ర విప్లవాలనుండి వచ్చాయి. చట్టం అందరినీ సమానంగా చూడాలని, వాక్‌సభా స్వాతంత్ర్యాలను అభిప్రాయస్వేచ్ఛను,మతస్వేచ్ఛను గౌరవించాలని, ఎవరినీ ఒకే నేరానికి రెండు సార్లు శిక్షించడానికి వీలు లేదని ఎవ్వరిచేత బలవంతంగా నేరం ఒప్పించాడానికి వీలు లేదనీ, సహజ న్యాయసూత్రాలకు అనుగుణమయిన చట్టం ద్వారా తప్ప ఇతరత్రా ఎవ్వరి ప్రాణాన్ని స్వేచ్ఛను తీసేయడానికి వీలు లేదనీ, కారణం చెప్పకుండా, ఎవరినీ నిర్బంధించరాదని భారతరాజ్యాంగంలోని అధికరణలు 14, 19, 20, 21, 22 అంటాయి. ఈ ఆకాంక్షలు అన్ని దేశాలలో ఏదో ఒక చారిత్రక దశలో ముందుకొచ్చినవే. అయినా, ఇవి ఆధునిక కాలములో శాసనరూపం తీసుకొన్నది. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా మొదలయిన పాశ్చాత్యా దేశాలలో జరిగిన బూర్జువా ప్రజాతంత్ర విప్లవ పోరాటాలల్లోనే అక్కడ పుట్టి ఇవి ఆధునిక నాగరికతకు కీలకమయిన విలువలుగా మారి మన రాజ్యాంగంలోకి జాతీయ ఉద్యమం ద్వారా దిగుమతి అయ్యాయి. అయితే ఈ హక్కులను పూర్తిగా ఇవ్వగలమన్న ఆత్మవిశ్వాసం లేని పాలకులు వీటిని అనేక మినహాయింపులతో కుదించారు. పోలీసులకు అలవాటయిన చిత్రహింసల సంప్రదాయం, పోలీసు చట్టంలోని సెక్షన్ 39 కలిస్తే ఈ అన్ని ప్రాథమిక హక్కులకు విరుగుడు అవుతాయి. ఆచరణలో అవుతున్నాయి కూడ. ఇక్కడ పౌరహక్కుల ఉద్యమానికి ఒక ప్రధాన కర్తవ్యం ఉంది. ఎన్‌కౌంటర్లు, లాకప్పు మరణాలు, విచ్చల విడిగా పోలీస్ కాల్పులు, లాకప్పులలో చిత్రహింసలు, సోదాలు, నిషేధాలు, సభల విచ్ఛిన్నం, నాసా, టాడా, ఎస్మా వంటి నల్ల చట్టాలను వ్యతిరేకించేటప్పుడు ఈ కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాం.

మరి కొన్ని హక్కులు బూర్జువా ప్రజాతంత్ర విప్లవం యొక్క అసమగ్రతను ఎత్తి చూపే పోరాటాలలో ముందుకొచ్చాయి. అందరికీ తిండి , బట్ట, నివాసం, గౌరవప్రదమయిన జీవనం, శుభ్రమయిన పరిసరాలు, విద్యావైద్య సౌకర్యాలు, సామాజిక సమానత్వం, సమాన అవకాశాలు మొదలయినవి ఈ హక్కులు. ఇవేవీకూడా మొదటి హక్కులను శాసనీకరించిన బూర్జువా ప్రజాతంత్ర విప్లవం అజెండాలో లేవు. కార్మికరైతాంగ పోరాటాలు, సోషలిస్ట్ ఉద్యమం,మహిళా ఉద్యమం మొదలయిన పోరాటాలు ఈ హక్కులకు గుర్తింపు తెచ్చాయి. సోవియట్ రష్యాలో ప్రజల భౌతిక జీవితాన్ని మెరుగుపరచడంలోనూ, అసమానతలను తగ్గించడంలోనూ సాధించిన విజయాలు త హక్కులకు చాలా బలాన్ని ఇచ్చాయి. మన రాజ్యాంగకర్తలు వీటిని కాదనలేక, అదే సమయంలో ప్రాథమిక హక్కులుగా గుర్తించనూ లేక ప్రభుత్వ విధానాలకు మార్గదర్శకమైన ఆదేశసూత్రాలుగా రాజ్యాంగం నాల్గవ అధ్యయంలో చేర్చారు. వీటికి ప్రాథమిక హక్కుల స్థాయి కల్పించాలన్న అంబేద్కర్ ప్రయత్నం ఫలించలేదు. 'దేశ పరిపాలనలో ప్రాధమిక ప్రాముఖ్యాన్ని కలిగివుంటాయి' అని ఆర్టికల్ 37 లో చెప్పిన ఈ ఆదేశిక సూత్రాలకు నిజంగానే ఆ ప్రాముఖ్యాన్ని కలిగించడానికి కృషిచేయవలసిన బాధ్యత పౌరహక్కుల ఉద్యమం మీద వుంది. ఆప్రాముఖ్యాన్ని కలిగించడం కోసం ఉద్యమిస్తూ వున్న కార్మిక కర్షక రైతు కూలీ తదితర బడుగువర్గాల పోరాటాలకు అండగా నిలబడవలసిన కర్తవ్యం పౌరహక్కుల ఉద్యమం మీద ఉంది. అదేసమయంలో ఈ ఆదేశిక సూత్రాలు కేవలం ఆదేశాలుగా ఉండిపోకుండా వీలయినంతవకకు వాటికి ప్రాథమిక హక్కుల స్థానం కల్పించే రీతిగా వాటికి న్యాయస్థానాల చేత పునర్వ్యాఖ్యానం ఇప్పించవలసిన కర్తవ్యం ఉంది. 1978 తరువాత కోర్టులు కొన్నాళ్లు ఈ రకమయిన వ్యాఖ్యానాలు కొంతమేరకు చేసి, మళ్లీ ఇప్పుడు చప్పబడ్డాయి.

మరికొన్ని హక్కులు, మనదేశ చరిత్రకు ప్రత్యేకమయిన కులవ్యతిరేకపోరాటాలనుండి వచ్చాయి. సామాజిక జీవితంలో గాని, ఆచార వ్యవహారాలో గాని విద్యా ఉద్యోగ అవకాశాలలోగాని, కుల వివక్ష పాటించడానికి వీలులేదని రాజ్యాంగంలో అధికరణలు 15,16, 17 అంటాయి. వీటి వెనక కొన్ని శతాబ్దాల కులవ్యతిరేక పోరాటాలు వున్నాయి. ఆ పోరాటాల నుండి పుట్టిన హక్కులను ఈ అధికరణలు క్రోడీకరించాయి. అయినా కులవివక్ష, రిజర్వేషన్ సమస్య ముందుకొచ్చినప్పుడల్లా ఈ చట్టపరమయిన గుర్తింపు ఎంత బలహీనమయినదో అర్థమవుతుంది. కుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించడమన్నా రిజర్వేషన్లను సమర్థించడమన్నా శతాబ్దాల కులవ్యతిరేకపోరాటాల విజయాలను కాపాడడం, ఆ పోరాటాలను ముందుకు తీసుకుపోవడం. ఇది పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యాలలో ఒకటి.

ఈ నిర్దిష్ట మయిన హక్కులేకాక, మొత్తంగా ప్రజాతంత్ర ఉద్యమాల నుండి పుట్టిన ప్రజాస్వామిక విలువలను కాపాడడం, సజీవంగా ఉంచడం, మరింత ముందుకు తీసుకుపోవడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యము. సమానత్వం, ప్రజాస్వామ్యము, లౌకికవాదం మొదలయినవి ఈ విలువలు. ప్రస్తుత సామాజిక రాజకీయ పరిస్థితులలో అన్ని హక్కులతో పాటు ఈ విలువలకు కూడా స్థానం లేకుండా పోతూవుంది.. ప్రజాస్వామిక విలువల విధ్వంసన ఈనాటి పాలక రాజకీయాల సారాంశము. ఆ సరళిని వ్యతిరేకించడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యం అయింది.

**ప్రస్తుత పరిస్థితి :** ప్రజల పట్ల అలక్ష్యం, ఉద్యమాల పట్ల అణచివేత వైఖరి, లౌకికవాదం, సామాజిక సమానత్వం మొదలయిన ప్రజాస్వామిక విలువల విధ్వంసనం, ఇవ్వాళ మనకు కనిపించే పాలక రాజకీయాల లక్షణం. ప్రజలు ఎదుర్కొంటూ వున్న ఏ సమస్యనూ దేశపాలకులు పరిష్కరించలేకుండా వున్నారు. ధరలు తగ్గించలేకుండా వున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేకుండా వున్నారు. భూమిలేని వారికి, కూలీ దొరకని వాళ్లకు, జీవనమార్గం చూపించలేకుండా వున్నారు. వ్యవసాయదారులకూ కార్మికులకూ శ్రమకు తగ్గ ప్రతిఫలం ఇవ్వలేకండా వున్నారు.

దళితులలోనూ స్త్రీలలోనూ పెల్లుబికుతువున్నా సమానత్వ ఆకాంక్ష మీద నిత్యం జరుగుతున్న దాడులను ఆరికట్టే ప్రయత్నమేమీ చేయకుండా వున్నారు. వివిధ జాతుల, భాషల మతాల ప్రజానీకం విశ్వాసాన్ని ప్రజాస్వామికంగా పొందడంలో విఫలమయి అణిచివేత మార్గాన్ని అవలంబిస్తున్నారు.

ఈ పరిస్థితులలో దేశమంతటా ఆందోళనలు, పోరాటాలు, అసంఘటితమయిన అలజడులు ముందుకు వస్తున్నాయి. రకరకాల రాజకీయ సిద్ధాంతాలతో వ్యూహాలతో ఎత్తుడగలతో ఆందోళనలూ పోరాటాలు నడుస్తున్నాయి. ఈ సిద్ధాంతాల సత్యాసత్యాల గురించి, వ్యూహాల ఎత్తుగడల మంచిచెడుల గురించి, ఎవరికే ఏ అభిప్రాయం వున్నా ఈ సంఘర్షణలన్నీ మౌలికమయిన సామాజిక ఆర్థిక సమస్యలనుండి పుట్టిన రాజకీయ ఆందోళనలేనని పౌరహక్కుల ఉద్యమం గుర్తిస్తుంది. ఆ ఉద్యమాలు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే నిరోధించే బాధ్యత, నేరాలను విచారించే బాధ్యత ప్రభుత్వం మీద తప్పని సరిగా ఉంటుంది. అయితే ఉద్యమాల వెనకవున్న సమస్యలను విస్మరించి ఉద్యమం యొక్క రాజకీయ స్వభావాన్ని గుర్తించడానికి నిరాకరించి ఉద్యమాన్నే ఒక నేరంగా భావించే అప్రజాస్వామిక పరిపాలన సరళిని పౌరహక్కుల ఉద్యమం నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తుంది. ఇవ్వాలదేశ వ్యాపితంగా ఇదే జరుగుతూ వుంది. అది పంజాబులో గానీ, కాశ్మీరులోగానీ, అస్సాం, నాగాలాండ్, మిజోరంలలో గాని , ఆంధ్ర, బీహార్ రాష్ట్రాలలోగాని అన్నిచోట్లా పోలీసు ప్యారా మిలిటరీలను ప్రయోగించడం, నాసా, టాడా, కల్లోలిత ప్రాంతాల చట్టం, సైనిక దళాల చట్టం మొదలయిన నల్ల చట్టాలతో ఉద్యమాలను అణచివేసే వైఖరిని ప్రభుత్వం యంత్రాంగం అవలంబిస్తూ వుంది. ఆ ఉద్యమాలు వేలెత్తి చూపుతూవున్న సమస్యలకు పరిష్కారం వెతకకుండ ప్రభుత్వం హిట్ లిస్టులు తయరుచేస్తోంది. బూటకపు ఎన్‌కౌంటర్లతో, చిత్రహింసలతో, ఆస్తులు విధంసతో తప్పుల కేసులతో భావప్రకటనా స్వేచ్ఛ పైన నిషేధాలతో అణగదొక్కాలని చూస్తూవుంది.

దళితులలో స్త్రీలలో పెరుగుతున్న సమానత్వ ఆకాంక్ష ఫలితంగా వాళ్ల మీద అత్యాచారాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఈ అత్యాచారాలకు పాల్పడే వాళ్లకు సహకరిస్తోందే తప్ప అణిచివేతకు గురయ్యేవాళ్లకు రక్షణ కల్పించడం లేదు. దాడులు చేసే దుండగుల మీద కేసులు సరిగా పెట్టరు. విచారణ సక్రమంగా జరుపరు. రిజర్వేషన్ల పట్ల ఒక ఉన్మాదం లాగా ముందుకొచ్చిన వ్యతిరేకత పట్ల ప్రభుత్వం ఎంత ఉదాసీనత వైఖరిని అవలంబించిందో అందరూ చూసాం. వరకట్న చావులయితే ప్రభుత్వనికే కాదు సమాజములో ఎవ్వరికీ చీమకుట్టినట్టు కూడ అనిపించడం లేదు.

దేశ అభివృద్ధి పేరుమీద అమలువుతున్న పారిశ్రామిక విధానం, ఆటవీ విధానం, ప్రజల జీవితంతో, జీవనంతో చెలగాటమాడుతున్నాయి. పారిశ్రామిక కాలుష్యం, అడవుల విధంసనం, ప్రాజెక్టుల నిర్మాణం, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. జీవనాన్ని నాశనం చేస్తున్నాయి. నిలువనీడలేకుండా చేస్తున్నాయి.

పాలక రాజకీయాలు మొత్తంగా అప్రజాస్వామిక సంస్కృతిని అలవరుచుకొన్నాయి. ప్రజల సమస్యల గురించి చర్చ, పరిష్కార మార్గాల ప్రతిపాదన, పార్లమెంటరీ రాజకీయాలలో రాజకీయ సంఘర్షణకు పునాది కావాలి. అది పోయి గూండాయిజం, సారయి, రిగ్గింగ్, దొంగనోట్లు అన్నింటిని మించి మతోన్మాదం,పాలక రాజకీయాలకు పునాది అవుతున్నాయి. శతాబ్దాల పోరాటాల ఫలితంగా ప్రజలుసాధించుకున్న ప్రజాస్వామిక విలువలు ఈ క్రమములో ధ్వంసం అవుతున్నాయి.

సమాజములో పెరిగిపోతున్న నిరుద్యోగం వల్ల తీవ్రమవుతున్న సామాజిక సంక్షోభం వల్ల ప్రజలలో పాలనా యంత్రాంగం పట్ల రోజు రోజుకు పడిపోతూవున్న విశ్వాసం వల్ల నేరాలూ, అల్లరులూ, ఎక్కువవుతూ వున్నాయి. వీటిని నివారించే ఉపాయంగానీ చట్టబద్ధంగా విచారించే ప్రజాస్వామిక వైఖరిగాని లేని ప్రభుత్వం పోలీస్ యంత్రాంగానికి 'శాంతి భద్రతల' నిర్వహణ పేరిట విశేష అధికారాలు ఇస్తూ వుంది. దానితో లాకప్పులలో చిత్రహింసలు, లాకప్పు మరణాలు, పోలీస్ కాల్పులు ఎక్కువవుతున్నాయి.

ఇది స్థూలంగా దేశంలోనూ, రాష్ట్రములోనూ నెలకొన్న పౌరహక్కుల పరిస్థితి. ఈ నేపధ్యములో మనం గత రెండేళ్లుగా చేపట్టిన కార్యక్రమాలనూ, విజయాలనూ, వైఫల్యాలనూ, నిర్మాణ సమస్యలనూ చర్చించుకుందాము.

(మిగతా వచ్చే సంచికలో....)

# పౌర హక్కుల ఉద్యమం : ఆచరణ

*(రాష్ట్ర మహాసభల్లో ఆమోదించిన కార్యదర్శి నివేదిక రెండవ భాగం)*

గత రాష్ట్ర మహా సభల తరువాత గడచిన 2 సంవత్సరములలో మన రాష్ట్ర పోలీసులు 85 వేరువేరు సంఘటనలలో 125 మందిని చంపారు. పోలీసు కస్టడీ నుండి 'మాయం' అయినవారిని ఇందులో లెక్కబెట్టడం లేదు. అందులో 5 మినహా మిగిలిన అన్ని హత్యల గురించి మనం వివరమయిన రిపోర్టులు సంపాదించగలిగాము. పోలీసు కాల్పులు, లాకప్పు మరణాలు, ఎన్‌కౌంటర్లని , ఈ హత్యలను మూడుగా విడగొట్టి చర్చిద్దాము.

## పోలీసు కాల్పులు

గడచిన రెండేళ్ళలో మొత్తం 22 కాల్పుల సంఘటనలలో పోలీసులు 39 మందిని చంపారు. అందులో 5 కాల్పుల గురించి మన దగ్గర సమాచారం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు దొంగలను, నిజామాబాదు జిల్లాలో ఇద్దరు దొంగలను నల్గొండలో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయబోతుండగా వాళ్ళు ప్రతిఘటించేసరికి వాళ్ళప్రతిఘటనను ఎదుర్కొనడానికి పోలీసులుకాల్పులు జరపవలసివచ్చిందనీ వాళ్ళు చనిపోయారనీ పోలీసులన్నారు.ఇదిఎంత నిజమో మనం పరిశోధించలేకపోయాము. ప్రాణాలు తీసిన తక్కిన 17కాల్పుల గురించి మనం వివరాలు సేకరించాము.

ఈ కాల్పులు ఏ పరిస్థితులలో జరుపుతున్నారో ఎవరు చనిపోతున్నారో గమనిస్తే మనకు దేశంలో పోలీసు యంత్రాంగం నిర్వహిస్తున్న పాత్ర గురించి చాలా విషయాలు అర్థం అవుతాయి. నిజామాబాద్ జిల్లా కల్వరాలలో, వ్యక్తిగత కక్షతో గ్రామములో ఇళ్లకు అగ్గిపెట్టిన కానిస్టేబులును తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్న ప్రజలపైకి ఎట్టి కారణము లేకుండా కాల్పులు జిరిపి ముగ్గురిని చంపారు. కానిస్టేబులును తీసుకొచ్చి పై అధికారుల సమక్షంలో క్షమాపణ చెప్పిస్తే సరిపోయేదానికి మూడు ప్రాణాలు అనవసరంగా పోయాయి. గుంటూరు జిల్లా పొన్నూరులో దళిత మహా సభ నాయకులు కత్తి పద్మారావు మీద తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేసి అయనకు ఏమయినా హాని జరుగుతుందేమోనని ఆందోళన చెందిన దళిత మహాసభ అనుచరుల మీద విచక్షణా రహితంగా కాల్పులు జరిపి ఒకరిని చంపారు. పద్మారావు ఎక్కడున్నాడో వాళ్లకు చూపించి భయం పోగొట్టి వుంటే సరిపోయేది. అదే జిల్లా రెంటచింతలలో ఒక స్త్రీ పైన అత్యాచారం చేసిన పోలీసు కానిస్టేబులును తమకు అప్పగిస్తే తామే న్యాయం చేస్తామని పోలీసు స్టేషన్ బయట ఆందోళన జరిపిన జనం మీదికి, వాళ్ళు ఏ హింసకు పాల్పడకుండానే కాల్పులు జరిపి ఇద్దరిని చంపారు. కరీంనగర్ జిల్లా కమాలాపూర్‌లోనూ ఇటువంటి సంఘటనే జరిగింది. ప్రజలు కోరినట్లు పోలీస్ కానిస్టేబులును అప్పగించి ఉండవలసిందని అనటంలేదు. అయితే పోలీసులు నేరం చేస్తే వాళ్ల పై అధికారులు వాళ్ళను శిక్షించరనే అవిశ్వాసం ప్రజలలో ప్రబలినప్పుడు వారిని శాంతింపచేసే ఆలోచనయినా ఉండాలికదా!

చిత్తూరు జిల్లా నగరిలో స్థానిక మంత్రిగారి అనుచరుడి ఆధిపత్యాన్ని నిలబెట్టడంకోసం అయనను వ్యతిరేకించిన వారిమీద కాల్పులు జరిపి ముగ్గురిని చంపారు. నిజామాబాద్ జిల్లా బాన్స వాడలో కుస్తీ పోటీ దగ్గర తలెత్తిన వివాదాన్ని నిర్వాహకులు సామరస్యంగా పరిష్కారం చేసే ప్రయత్నంలో వుండగా పోలీసులు అనవసరంగా జనాన్ని కొట్టి ఎందుకు కొడుతున్నారని జనం ఎదురుతిరిగితే పోలీసు స్టేషన్‌కు పారిపోయి తుపాకులు తీసుకొచ్చి జనాన్ని తరిమితరిమి కాల్చారు. 5 మంది అప్పుడే చనిపోగా ఒకరు తరువాత చనిపోయారు. నెల్లూరు జిల్లా ఇడిమేపల్లిలో సర్పంచ్ అక్రమ ప్రవర్తన మీద ఫిర్యాదు చేసిన ప్రత్యర్థుల ఫిర్యాదును సంబంధిత అధికార్లు పట్టించుకోకపోగా అది గ్రామ కక్షలకు దారితీసి చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్పంచ్ ప్రత్యర్థులను అరెస్ట్ చేసే పేరుమీద ముగ్గురిని కాల్చేసారు. మొదట్లోనే జిల్లా కలెక్టరు, పంచాయితీ అధికారి, సర్పంచ్‌మీద విచారణ జరిపి తగు చర్య తీసుకొని వుంటే సరిపోయేది. నిజామాబాద్ జిల్లా పడ్కల్‌లో కరెంటు సరఫరా సక్రమంగా జరగాలని ఆందోళన చేస్తున్న రైతుల మీద కాల్పులు జరిపి ఇద్దరిని చంపారు. గుంటూరు జిల్లా అప్పాపురంలో తుఫాను సహాయ పంపిణీలో అధికారులు కాంగ్రెస్ నాయకుల చెప్పుడు మాటలు వింటున్నారు తప్ప నిజమయిన బాధితులకు సహాయం ఇవ్వడం లేదని అలజడిచేసిన తెలుగుదేశం కార్యకర్తల మీద కాల్పులు జరిపి ఇద్దరిని కాల్చేసారు. మహబూబ్ నగర్ జిల్లా నందివడ్డెమానులో కల్లు ధర పక్క గ్రామాల స్థాయికి తగ్గించాలని ఆందోళన చేస్తున్న జనం మీద కాల్పులు జరిపి ఒక వ్యక్తిని కాల్చేసారు. ప్రకాశం జిల్లా గొట్టిపడియ గ్రామములో తగాదా పడుతున్న రెండు గ్రూపులను శాంత పరిచే బదులు కాల్పులు జరిపి ఒక వ్యక్తిని చంపేసారు. మహబూబ్‌నగర్ జిల్లా ఖిలాఘనపూర్‌లో మత ఘర్షణలను అదుపుచేసే క్రమంలో జనాన్ని విపరీతంగా కొట్టి వాళ్లపై అధికార్లకు ఫిర్యాదు చేయటానికి పోతుంటే ఒక వ్యక్తిని చంపారు. అదే జిల్లాలో పాపగల్లులో బాణామతి చేస్తున్నాడనే నెపంమీద ప్రజలు ఒక వ్యక్తిని హింసిస్తుంటే అతనిని కాపాడడానికి పోయి, జనం ఒప్పుకోకపోతే వాళ్లను లాఠీ చార్జీతో చెల్లాచెదరు చేసి తిరిగివస్తూ ఎదురుగా గ్రామములోనికి వస్తున్నయువకుల బృందాన్ని చూసి బెదిరిపోయి కాల్పులు జరిపి ఒకరి ప్రాణం తీసారు. ఇక నర్మెట్ట అచ్చంపేటకాల్పులు అయితే పూర్తిగా

రాజకీయంగా జరిగినవే. నర్మెట్టలో ధర్నా చేస్తున్న జనం లోని కొందరు యువకులు పోలీసు కానిస్టేబుల్‌ను కిడ్నాప్‌చేయగా ఆ కిడ్నాప్‌ను నివారించడానికి వాళ్లమీద చర్య తీసుకోవడం కాక జనం మీద కాల్పులు జరిపి ఇద్దరిని చంపారు. అచ్చంపేటలోనయితే మీటింగ్‌కు అనుమతి ఉందనే భావనతో వేల సంఖ్యలో తరలి వస్తున్న జనం మీదికి నేరుగా కాల్పులు జరిపి ముగ్గురిని కాల్చేసారు.

ఇంత క్లుప్తంగా చెప్పుకున్నా ఈ సంఘటనల నుండి ఒక విషయం అర్థం అవుతుంది. ఈ అల్లర్లు ఏవీ సంఘవ్యతిరేక శక్తుల చర్యకాదు. మామూలు జనం నిత్యజీవిత క్రమములో లేక హక్కుల కోసం ఉద్యమించే క్రమములో చేసిన చర్యలే. వీటి పరిష్కారం తుపాకులతో కాదు. ప్రజాప్రతినిధులయిన రాజకీయనాయకులు, పౌరపాలన యంత్రాంగము, కోర్టులు తీర్చవలసిన సమస్యలివన్నీ. దేశంలో అవేవి పనిచేయడం లేదు. సమస్య ఉత్పన్నమయినప్పుడు అవేవీ అక్కడకిరావు. ప్రజలకు నచ్చజెప్పి పరిష్కార మార్గం చూపించవు. దాని బదులు పోలీసులు వస్తారు. బలప్రయోగం ద్వారా అణచివేస్తారు.

పోలీసులు చేసే బలప్రయోగానికి నియమాలను చట్టం నిర్దేశించింది. నేరవిచారణ స్మృతి సెక్షన్ 129 లోనూ పోలీసు స్టాండింగ్ ఆర్డర్స్‌లోను ఆ విషయాలు వివరించబడ్డాయి. అయినా వాటిలో ఏఒక్క నియమాన్నీ పోలీసులు పాటించరు. వాటిని తప్పించుకోవడానికి తాము ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపామని అంటారు. ఈ మధ్యకాలంలో జరిగిన ఏ పోలీస్ కాల్పుల సంఘటనను పరిశీలించినా, నేరవిచారణ స్మృతి సెక్షన్ 129 నుండి సంక్రమించిన అధికారాన్ని వినియోగించుకొని కాల్పులు జరిపామని పోలీసులు అనడం కనిపించదు. అన్నీ కూడ ఆత్మరక్షణ పేరుమీద జరిగేవే. అటువంటపుడు ఆ కాల్పులకు బాధ్యులు అయిన వారందరినీ వెంటనే హత్యకేసులో అరెస్ట్ చేయాలి. నిజంగా ఆత్మరక్షణ అవసరం ఉందని వాళ్ళే కోర్టులో రుజువు చేసుకోవాలి. ఇది చట్టం నిర్దేశించే మార్గం . కానీ ఇదేమీ జరగడం లేదు.

ఈ కాల్పుల సంఘటనలన్నింటిమీదా మనం నిజనిర్ధారణ కమిటీలు వేసాము. నిజామాబాద్ జిల్లా కల్వరాల కాల్పుల మీద జరిగిన న్యాయ విచారణలో చురుకుగా పాల్గొన్నాము. గుంటూరు జిల్లా పొన్నూరు, రెంటచింతల కాల్పుల మీద ఇతర ప్రజాతంత్ర్య సంస్థలతో కలిసి బహిరంగసభలు నిర్వహించాము. నెల్లూరుజిల్లా ఇడిమేపల్లి కాల్పుల మీద సర్వేపల్లిలోనూ, మహబూబ్‌నగర్ జిల్లా నందివడ్డెమాను కాల్పుల మీద నాగర్ కర్నూల్‌లోనూ బహిరంగ సభలు నిర్వహించాము. అచ్చంపేట కాల్పులు మీద మహబూబ్‌నగర్ పట్టణంలో పెద్ద ఎత్తున సభ నిర్వహించాము.

విచ్చలవిడిగా జరుగుతున్న ఈ కాల్పుల వాస్తవాలను తెలియజేస్తూ ఒక కరపత్రం వేశాము. రాష్ట్ర వ్యాపితంగా పంచాలని అనుకున్నప్పటికీ కృష్ణ, హైదరాబాదు, విశాఖపట్నం విజయనగరం, శ్రీకాకుళం యూనిట్లు మాత్రమే కరపత్రాన్ని అచ్చువేసి పంచాయి. ఈ రాష్ట్ర మహాసభల సందర్భంగా పోలీసు కాల్పులకు సంబంధించిన చట్టపరమయిన నియమాలను వివరిస్తూ ఒక పుస్తకం ప్రచురించాము.

ఈ మేరకు మనం పోలీస్ కాల్పుల గురించి ప్రచారం చేసామేగాని ఇంకా చేయగలిగింది చాలా వుంది. గత రాష్ట్ర మహాసభలో ఈ విషయాన్ని చర్చించుకున్నప్పుడు ఒక నిర్ణయాన్ని తీసుకొన్నాము. ఏ పౌరహక్కుల సమస్యమీదనయినా నిజనిర్ధారణ కమిటీ వేసి రిపోర్టు పత్రికలకు ఇవ్వడమేకాక 'ఫాలోఅప్' చర్యలు చేపట్టాలని నిర్ణయించుకున్నాము. సమస్యను వివరిస్తూ కరపత్రము వేయాలని బహిరంగ సభకానీ, ధర్నావంటి నిరసన కార్యక్రమాలు చేపట్టాలనీ, మేజిస్టీరియల్ విచారణలో పాల్గొని మన నివేదిక ఇవ్వాలనీ అనుకున్నాము. ఈ కార్యక్రమాలు కొన్ని కేసులలోనే చేపట్టడం విచారకరం. ఇప్పుడు మనకు 20 జిల్లాలలో యూనిట్లు వున్నాయి. నిర్మాణం గతంలో కంటే మెరుగయింది. అటువంటప్పుడు అన్ని పోలీసు కాల్పుల సంఘటనలలోనూ మనం 'ఫాలోఅప్' కార్యక్రమము చేపట్టకపోవడానికి హేతుబద్ధమయిన కారణమేమీ లేదు.

## పోలీసు కస్టడీలో మరణాలు

1990 లో లాకప్పు మరణాలు సగటు కంటే బాగా తక్కువగా జరిగాయి. మన రాష్ట్రములో సగటున సంవత్సరానికి 20 లాకప్పుమరణాలు జరుగుతాయి. 1990 లో 12 జరిగాయి. అయితే రాష్ట్రములో లాకప్పు మరణాలు తగ్గిపోతున్నాయని ఆశించడానికి వీలు లేకుండా 1991 లో ఇప్పటికే 8 మందిని పోలీసులు లాకప్పులో పొట్టన పెట్టుకున్నారు.

గత రాష్ట్ర మహాసభలకూ ఈ మహాసభలకూ మధ్య మొత్తం 27 లాకప్పు మరణాలు జరిగాయి. గత రాష్ట్ర మహాసభలప్పుడు మనం లాకప్పు మరణాల మీదొక పుస్తకము ప్రచురించాము. అందులో రెండు విషయాలు గణాంకాలతో సహా వివరించాము. లాకప్పు మరణాలలో చనిపోయిన వారంతా బడుగువర్గాల ప్రజలేననేది ఒక విషయం. వీళ్లెవరూ తీవ్రమయిన నేరాలలో ముద్దాయిలు కారనేది రెండవ విషయం. కళ్యాణ దుర్గం లాకప్పులో చనిపోయిన హరిజన చెన్నప్ప జీతగాడు. పొలంలో పైపులు దొంగిలించాడని ఇతని మీద ఆరోపణ. హైదరాబాద్ గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో చనిపోయిన రాజా ప్రెస్ కార్మికుని కొడుకు. అతని మీద ప్రత్యేకమయిన నేరారోపణ ఏదీలేదు. నేరాలు పెరిగిపోతున్నాయని పాత కేడీలందరినీ పిలిపించి ప్రశ్నించిన క్రమంలో చనిపోయినాడు. మహానంది లాకప్పులో చనిపోయిన చెంచు చినపాపన్న గిరిజనుడు. అతని మీద వున్నది చిన్న దొంగతనము కేసు. సామర్లకోట లాకప్పులో చనిపోయిన వేంకటేశ్వర్లు మేస్త్రీ. అతని మీద ఉన్నది చిన్నకేసు. నక్కపల్లి పోలీసుల చేతిలో చనిపోయిన అప్పల నరసింహరాజు కార్మికుడు. సమ్మె చేయించడం అతని నేరం. చీపురుపల్లి లాకప్పులో చనిపోయిన శ్రీనివాసరావు నిరుద్యోగ యువకుడు. అతని మీద అనుమానం సైకిల్ దొంగిలించాడని. గోదావరిఖని పోలీసులు కొట్టి చంపిన జక్కం మల్లేశం రేడియోలు మరమ్మత్తు చేసే మనిషి. అతని మీద అభియోగం తాగి అల్లరి

చేసాడని. హుస్నాబాద్ లాకప్పులో చనిపోయిన ఉప్పులేటి చంద్రయ్య హరిజనుడు. ఒకటి రెండు దొంగతనం కేసులలో ముద్దాయి. నగరం లాకప్పులో మరణించిన నెల్లూరి బాబూరావు 16 ఏండ్ల యువకుడు. టేప్‌రికార్డర్ దొంగతనం అతని మీద అభియోగం. నెల్లూరు 3వ టౌన్ పోలీసుల దెబ్బలకు చనిపోయిన చిట్టిబాబు సీనియర్ ఇంటర్ విద్యార్థి. స్నేహితులతో కూర్చొని పేక ఆడడం అతని నేరం. రాయికల్ లాకప్పులో చనిపోయిన గుర్రపు లింగయ్య రైతు. ఒక స్నేహితుని ఇంట్లో ఆభరణాలు దొంగిలించి, పెద్దమనుషులు మందలించగా తిరిగి ఇచ్చేసాడు. ఇది అతని నేరం. దాములూరులో పోలీసుల దెబ్బలకు చనిపోయిన గురువయ్య రిక్షా కార్మికుడు. పేకాట ఇతని నేరం. చిగురుమామిడి లాకప్పులో చనిపోయిన రాజయ్య రైతు. భీరపాదు గురించి తన చిన్నాన్న, చిన్నమ్మలతో కొట్లాటపెట్టుకొని వాళ్లమీద చెయ్యి చేసుకున్నాడు. ఇది అతని నేరం. నందిగామకు చెందిన మోచర్ల చిన వెంకటేశ్వర్లు రిక్షాకార్మికుడు. చీరల దొంగతనము గురించి, అతనిని పోలీసులు అనుమానించారు. మహబూబ్‌నగర్ (రూరల్) లాకప్పులో చనిపోయిన మోత్యా గిరిజనుడు. రిక్షాకార్మికుడు. ఒక దొంగ దొంగిలించిన సొమ్ముతో ఇతని రిక్షాలో ప్రయాణము చేసాడు. అది ఇతని నేరము. ఇబ్రహింపట్నం లాకప్పులో మరణించిన జోగి రైల్వే కార్మికుడు. ఒక స్త్రీతో అసభ్యంగా ప్రవర్తించాడనేది అతని మీద అభియోగము. పొన్నూరులో చనిపోయిన క్రిష్టఫర్ వడ్రంగము పనిచేసేవాడు. గ్యాస్‌సిలిండర్ దొంగతనం కేసులో అనుమానితుడు. మహానంది లాకప్పులో మరణించిన బోయి కాశిమయ్య చిన్నచిన్న దొంగతనాలు చేసేవ్యక్తి. అతనితో పనికిపోయిన గిరిజనుల సద్దులు, చెప్పులు దొంగిలిస్తాడని ఇతని మీద అభియోగము.

గతంలో ప్రచురించిన పుస్తకములో హత్య బందిపోటుచర్యలు లైంగిక అత్యాచారాలు అనే మూడింటిని తీవ్రమయిన నేరాలుగా నిర్వచించాము. పైన ఇచ్చిన సవరణను బట్టి రెండేళ్ల లాకప్పులో చనిపోయిన వారెవ్వరూ తీవ్రమయిన నేరాలలో ముద్దాయిలు కారని అర్థమవుతుంది. లాకప్పులో ఎవరినీ చిత్రహింసలకు గురిచేయరాదని, చిత్రహింసలద్వారా సమాచారం రాబట్టటాన్ని భారత శిక్షా స్మృతి 330, 331 నేరంగా ప్రకటించాయనీ, ఎవ్వరిచేత బలవంతంగా నేరం ఒప్పించకూడదనేది ప్రాథమిక హక్కుగా రాజ్యాంగములో అధికరణ 20 (3) శాసించిందనీ, ప్రచారం చేసేటప్పుడు లాకప్పులో చంపుతున్నది చిన్నచిన్న నేరాలలో ముద్దాయిలయిన పేదవాళ్లనేనని కూడ వివరించి చెప్పున్నాము.

అయితే పోలీసు కాల్పులలాగే లాకప్పు మరణాల విషయములో కూడ మనం 'ఫాలోఅప్' కార్యక్రమం ఎక్కువగా చేపట్టడం లేదు. గుంటూరు, కృష్ణాజిల్లా శాఖలు మట్టుకే అన్ని లాకప్పు మరణాలమీద బహిరంగ సభలు తప్పనిసరిగా నిర్వహిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట లాకప్పు మరణము మీద నిర్వహించిన బహిరంగ సభ ఆ జిల్లాలో పౌరహక్కుల సంఘానికి గుర్తింపు తెచ్చిపెట్టింది. వేరే ఎక్కడా కనీస కార్యక్రమము కూడ చేపట్టలేదు. పోలీసు కాల్పుల విషయములో చెప్పినట్లు కరపత్రాలు వేయడం, బహిరంగ సభలు ఊరేగింపులు నిర్వహించడం మెజిస్టీరియల్ విచారణలో పాల్గొనడం తప్పని సరిగా చేపట్టవలసిన కార్యక్రమము.

నష్టపరిహారం కోసం కోర్టులో కేసులు వేయాలని కూడ అనుకున్నాం. అదీ అమలు కావడం లేదు. లాకప్పు మరణాలకు ప్రభుత్వం ఒక్కొక్కసారి 10 వేల రూపాయాల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తుంది. ఒక్కొక్కసారి అదికూడ వుండదు. అయితే కోర్టులు చాలా కాలంగా అడపాదడపా ఇంకా పెద్ద మొత్తాన్ని నష్టపరిహారం క్రింద మంజూరు చేస్తున్నాయి.మన రాష్ట్రంలో చల్లా రామకృష్ణారెడ్డి వర్సస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో 1 లక్షా 44 వేల రూపాయిల్ని కోర్టు మంజూరు చేసింది. కేరళలో ఒక కోర్టు ఇంకా పెద్దమొత్తాన్ని రాజన్ కేసులో మంజూరు చేసింది. ఢిల్లీకి చెందిన పియుడిఆర్ సంస్థ ఈ మధ్య కొన్ని లాకప్పుమరణాల కేసుల్లో నేరుగా సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేసి 50 వేలు, 75 వేలు నష్టపరిహారం పొందగలిగింది. ఈ ప్రయత్నం మనం తప్పని సరిగా చేపట్టాలి. పోస్ట్‌మార్టం రిపోర్ట్ లేక మేజిస్టీరియల్ విచారణ రిపోర్టు ఏ మాత్రం అనుకూలంగా వున్నా నష్టపరిహారం కోసం దావా వేయాలి. ఇది లాకప్పులో మరణాలకే గాక పోలీసు కాల్పులకు కూడ వర్తిస్తుంది.

పోలీసు కస్టడీలో ఎవ్వరు చనిపోయినా దానిని హత్యగా భావించి కేసు పెట్టాలనీ, నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయిల మీదనే పెట్టాలనీ, ఈరకమైన సవరణ చట్టంలో తీసుకురావాలనీ లా కమీషన్ తన 113 వ రిపోర్టులో అన్నది. సుప్రీంకోర్టు కూడ ఈ సూచన చేసింది. ప్రస్తుతము రాష్ట్ర అసెంబ్లీ ముందు ఒక ప్రైవేట్ బిల్లు వున్నది. పోలీసు కస్టడీలో మరణము సంభవించినట్లు తెలియగానే జిల్లా జడ్జి దానిని కేసుగా నమోదు చేసుకొని సాక్ష్యాలు సేకరించాలని సాక్ష్యాలు ప్రాథమికంగా సంతృప్తికరంగా వుంటే ప్రాసిక్యూషన్ ప్రారంభించాలనీ, దానికోసం నేరవిచారణ స్మృతిలో తగిన సవరణలు చేయాలనీ ఈ బిల్లు ప్రతిపాదిస్తున్నది. దీనిని ప్రవేశపెట్టిన వ్యక్తి పౌరహక్కుల సంఘాన్ని తన శత్రువుగా భావించే ఎంసిపిఐ నాయకుడు ఓంకార్ గారు. వారికి మన పట్ల వున్న వైఖరి ఎటువంటిదయినా ఈ బిల్లును మనం ప్రచారంలో పెట్టి దాని ఆమోదం కోసం చేయగల కృషి చేయాలి.

## ఎన్‌కౌంటర్లు

గడచిన రెండు సంవత్సరాలలో మన రాష్ట్రంలో 59 మంది నక్సలైట్లు అనే పేరు మీద 36ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. అందులో 14 మంది తెలుగుదేశం పాలన చివరిలోనూ, 45 మంది కాంగ్రెస్ పాలనలోనూ చంపబడ్డారు. ఈ 45లో 18 మంది చెన్నారెడ్డి హయాంలో, 27మంది జనార్దన్ రెడ్డి హయంలో చనిపోయారు. ఈ 36 ఎన్‌కౌంటర్లు కాక, పోలీసులు చనిపోయిన మూడు ఎన్‌కౌంటర్లు ఉన్నాయి. వాటిలో నలుగురు పోలీసులు చనిపోయారు.

మన రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లు ఎప్పుడూ రాజకీయంగానే జరుగుతున్నాయి. ఆ విషయాన్ని ఈ రెండు సంవత్సరముల ఎన్‌కౌంటర్లలో స్పష్టంగా చూడవచ్చును. 1989 సెప్టెంబర్ వరకు తెలుగు దేశం పాలన తన'ఎన్‌కౌంటర్' రికార్డును యథాప్రకారం కొనసాగించింది. సెప్టెంబర్ నెలనుండి రాజకీయ నిర్ణయం ఫలితంగా ఆగిపోయాయి. నవంబర్ నెలలో ఎన్నికల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ ఒక్కటే మినహాయింపు. ఆ ఎన్నికల తరువాత అధికారములోకి వచ్చిన చెన్నారెడ్డి ప్రభుత్వం అదే రాజకీయ నిర్ణయాన్ని అయిదునెలలు కొనసాగించింది. అయిదు నెలలు ఎన్‌కౌంటర్లు జరుగలేదు. మళ్లీ రాజకీయ నిర్ణయంగానే ఎన్‌కౌంటర్లు ప్రారంభమయి, 1990 మే నుండి చెన్నారెడ్డి దిగిపోయే దాక 18 మంది హతులయ్యారు. ఆ తరువాత వచ్చిన జనార్దన్ రెడ్డి ప్రభుత్వం అణచివేతలను ఇంకింత తీవ్రతరం చేయాలని నిర్ణయించుకోవడంతో ఎన్‌కౌంటర్ల రేటు మూడు రెట్లు పెరిగింది. జనార్దన్ రెడ్డి హయాంలో ఇప్పటికి 27 మంది చనిపోయారు.

పోలీసులు చనిపోయిన ఎన్‌కౌంటర్లు తప్ప మిగిలినవన్నీ బూటకమయినవే. మనం గత మే నెల నుండి జరిగిన అన్ని ఎన్‌కౌంటర్ల గురించీ సమాచారం సేకరించగలిగాం. చనిపోయిన వాళ్లలో రహస్యకార్యకర్తలు చాలా కొద్దిమంది. లీగల్ కార్యకర్తలు కొందరు, సానుభూతి పరులు కొందరు, మాజీ కార్యకర్తలు, నకిలీ నక్సలైట్లు కొందరు మరీ మామూలు జనాన్ని చంపినప్పుడు గుర్తు తెలియని తీవ్రవాది అని బొంకే ప్రయత్నం పోలీసులు కొనసాగిస్తున్నారు. అయితే పత్రికలూ, మనమూ ఆ గుర్తుతెలియని వారి గుర్తు తెలుసుకొని ఈ బూటకాన్ని బహిర్గతం చేస్తున్నాము. ఈ మధ్య జరిగిన దేవాపూర్, అందుగులపల్లి, బూరుగుపల్లి ఎన్‌కౌంటర్లలో ఇదే జరిగింది.

ఎన్‌కౌంటర్ల మీద మనం 1981 లో సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటీషన్ ఇంకా కొనసాగుతూవుంది. గత రాష్ట్ర మహాసభల నాటికి సుప్రీంకోర్టు ఒక మధ్యంతర ఆదేశం జారీచేస్తూ ఎన్‌కౌంటర్లను గురించి మనకు తెలిసిన వివరాలతో మనం రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం సమర్పించుకోవాలనీ, రాష్ట్ర ప్రభుత్వం ఆయా కేసుల మీద తాను తీసుకున్న చర్యలేమిటో రెండునెలల్లో సుప్రీంకోర్టుకు తెలియచేయాలనీ అన్నది. మనం అలాగే చేసాం. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత రాష్ట్రములో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్ల జాబితా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి ఇచ్చి, చట్టం ప్రకారం ఈ హత్యలకు బాధ్యులయిన వారందరి మీదా కేసులు నమోదు చేసి విచారించ వలసిందిగా కోరాం. ప్రభుత్వం కోర్టుకు సమాధానం చెప్పడానికి రెండు నెలలు కాదు, చాలా కాలమే పట్టింది. తెలుగుదేశం ప్రభుత్వం పోయి చెన్నారెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత డిజిపి ప్రభాకరరావుగారు సుప్రీంకోర్టుకు సమాధానం ఇచ్చారు. మొదట పౌరహక్కుల సంఘం మీదా, అధ్యక్షులు కన్నాభిరాన్‌గారిమీదా అబద్దపు విసుర్లు వేసారు. కన్నాభిరాన్‌గారు నక్సలైట్లకు సన్నిహితుడనీ అందువల్లే గుర్తేడుకు పోయి ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లను విడిపించగలిగారనీ ఒక అబద్ధం చెప్పాడు. ఆ తరువాత అసలు విషయానికొచ్చి, ప్రతి ఎన్‌కౌంటర్ మీదా గౌరవనీయులయిన స్థానిక సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఆర్‌డివో లేక సబ్ కలెక్టర్) నిష్పాక్షికమయిన విచారణ జరుపుతున్నారనీ ఆ విచారణ నివేదికను అనుసరించి చర్య తీసుకోవడం జరుగుతుందనీ అన్నారు. ఎన్ని మెజిస్టీరియల్ విచారణ రిపోర్టులు పోలీసులకు ప్రతికూలంగా వచ్చాయో, వాటిమీద ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందో డి.జి.పి. గారు సుప్రీంకోర్టుకు చెప్పలేదు. మనకు తెలిసినవి మూడు కేసులు ఉన్నాయి. మూడూ వరంగల్ జిల్లా కేసులే. నరసాపూర్, ఇంచగూడెం, శాయంపేట ఎన్‌కౌంటర్ల మెజిస్టీరియల్ విచారణ రిపోర్టులు పోలీసులను తప్పుపట్టాయి. మొదటి కేసులో పౌరహక్కుల సంఘం సాక్ష్యాలు నమోదు చేయించింది.. రెండవ కేసులో హతుడు సభ్యుడిగా ఉండిన రైతుకూలీ సంఘం ఆ కర్తవ్యాన్ని నిర్వహించింది. మూడవ కేసులో విచారణాధికారి తానే ఆ నిర్ణయానికి వచ్చినట్లున్నారు. అయితే ఈ మూడు నివేదికల మీదా ఏ చర్య తీసుకోలేదు సరికదా మూడూ కూడా అక్రమంగా జరిగాయని హోంశాఖ ప్రకటించి కొత్త విచారణకు ఆదేశం ఇచ్చింది. అయితే మామూలుగా పోలీసులు సాక్షులెవ్వరినీ విచారణ దరిదాపులకు రానివ్వరు కాబట్టి ఇటువంటి రిపోర్టులు రావడమే అరుదు.

ఎన్‌కౌంటర్లకు తోడుగా మనుషులను మాయం చేసే పద్ధతి కూడ మన రాష్ట్ర పోలీసులు అలవరుచుకున్నారు. కొందర్ని నామారూపాలు లేకుండా మాయం చేస్తున్నారు. కొందర్ని గుర్తుతెలియని తీవ్రవాదులు అనే పేరిట కాల్చేస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, నెల్లూరు, కరీంనగర్, వరంగల్,ఖమ్మం, తూర్పుగోదావరి, కృష్ణా, కోరాపుట్, ఒరిస్సా లలో జరిగిన 47 అదృశ్యాలు గురించి మనం సంపూర్ణమైన సమాచారాన్ని సేకరించగలిగాము. మొదట్లో ఐలయ్య, రాజమల్లుల కోసం ప్రభుత్వం నియమించిన టి.ఎల్.ఎన్.రెడ్డి న్యాయ విచారణ కమీషన్‌కు మరొక 43 కేసులు ప్రభుత్వం చేత 'రెఫర్' చేయించాం. 72 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయించాం. ఇంకా కొంత సాక్ష్యాన్ని రాబోయే రెండు నెలలలోపల నమోదు చేయించవలసి వుంది.కరీంనగర్‌కి చెందిన వసంత, సుజాత అనే ఇద్దరు వ్యవసాయకూలీ మహిళాసంఘం కార్యకర్తల అదృశ్యం హైకోర్టు విచారణలో ఉంది. హైకోర్టు ఆదేశించిన సెషన్స్‌జడ్జి విచారణలో పాల్గొని సాక్ష్యాలు నమోదు చేయించాం. ఆ యిద్దరు మహిళల అదృశ్యానికి రాష్ట్ర పోలీసు యంత్రాంగం , ప్రత్యేకించి సి.ఐ. మొగిలయ్య బాధ్యులని విచారణ అధికారి తీర్మానించారు. ఇప్పుడు హైకోర్టు చివరి ఆర్డర్ జారీ చేయాల్సి వుంది.

## దళితులపైన దాడులు, అణచివేత

కులం రీత్యా అణచివేతకు ఎదురయ్యే వారందరినీ దళితులు అంటున్నాం. మాల, మాదిగ లేక వివిధ గిరిజన తెగలు, మత్స్యకారులు, యానాదులు, వడ్డెరలు మొదలయిన వారు నిత్యం అణచివేతకు ప్రత్యక్షదాడులకు గురవుతూ ఉంటారు. మరీ ఇంత నికృష్టమయిన

స్థితిలోలేని వెనుకబడ్డ కులాల వారు కూడా ప్రత్యక్షంగా పరోక్షంగా అణచివేతను ఎదుర్కొంటూ ఉంటారు.

ఈ అంశానికి సంబంధించి మనం స్పందిస్తూవున్న సమస్యలను మూడుగా వర్గీకరించి చర్చిద్దాం.

## హత్యాకాండ, గృహదహనాలు

దళిత వర్గాలలో చైతన్యము పెరిగి తమకూ ఇతరులలాగా భూములు కావాలి, చదువుకావాలి, సామాజిక హోదా కావాలి, రాజకీయ స్వేచ్ఛ కావాలి అని వాళ్ళు కోరుకున్నప్పుడల్లా వాళ్లమీద దాడులు జరుగుతున్నాయి. కారంచేడు నుండి ఇప్పటిదాకా అనేక సంఘటనలు జరిగాయి. హత్యలుగానీ పెద్దెత్తున గృహదహనాలుగానీ జరిగిన సంఘటనలనే లెక్క పెట్టినా ఈ రెండేళ్ళలో రాష్ట్రంలో 12 ప్రధాన సంఘటనలు జరిగాయి. పశ్చిమగోదావరి జిల్లా పిప్పర గ్రామంలో దళిత స్త్రీల పట్ల అసభ్యంగాప్రవర్తించిన అగ్రవర్ణ యువకులను దళితులు నిలదీసినందుకు కసిగా వారి మీద పెద్దగుంపుగా వచ్చి దాడిచేసి చాలా మందిని కొట్టి కోట సుబ్బన్న అనే 60 సంవత్సరముల వృద్ధుడిని హత్యచేసారు. విజయనగరం జిల్లా చినకాద గ్రామంలో సారాయి విక్రయం విషయంలో సారా కాంట్రాక్టర్లు గిరిజనుల మీద కక్షబూని టెక్కలి బాగం దొర అనే గిరిజనుని మీద, అతని కుమారులైన అరున్నదొర, ఆదెన్న దొర, రామన్న దొరల మీద దొంగతనము నేరము మోపి పెద్ద ఎత్తున మారణాయుధాలతో దాడిచేసి 4 గురిని చంపారు. అదే విజయనగరము జిల్లా కస్పగదబవలసలో ఎప్పటి నుండో ఒక గిరిజన కుటుంబం అనుభవిస్తూవున్న భూమిని వారికి కాకుండా చేయాలని అగ్రకులస్తులు ప్రయత్నం చేసి , ఆప్రయత్నం కోర్టులలో విఫలం కాగా భూమిని గిరిజనుల చేతిలోకి పోకుండా ఉండాలని చూసి, అదీ విఫలంకాగా మారణాయుధాలతో దాడికి ఒడిగట్టి భూమి యజమాని అయిన ఈదర ఫకీరును అతని తోటి గిరిజనులయిన గొర్లె రాములు, దోసి రత్తాలు, మసాల పెంటయ్యలను, వాళ్ల పక్షాన మాట్లాడిన హరిజనుడు గరుగుబిల్లి పోతయ్యను చంపారు. చిత్తూరు జిల్లా చారాల వాండ్ల పల్లిలో వడ్డె వాళ్లు కాంగ్రెస్ పెత్తందారుకు వ్యతిరేకంగా పోతున్నారని వాళ్ల ఇండ్లమీద దాడిచేసి తగలబెట్టించారు. కడప జిల్లా పులివెందులలో తిరుగులేని రాజకీయ పెత్తందారయిన వై.ఎస్. రాజారెడ్డి ఎరుకల వాళ్ల ఇండ్లమీద పోలీసుల ప్రత్యక్ష పర్యవేక్షణలో దాడిచేసి తగుల బెట్టి, డైనమైట్లతో పేల్చివేసి దాదాపు 150 ఇండ్లను ధ్వంసం చేసాడు. కృష్ణాజిల్లా కంచికచర్ల లో చెన్నారెడ్డి ప్రభుత్వంలో మంత్రి అయిన మొక్కపాటి వెంకటేశ్వరరావుగారి సన్నిహితులయిన భూస్వామి కొడుకులు తన పాలేరయిన అర్లప్పను విపరీతంగా కొట్టి చంపి మిరపచేనులో పారేసారు.

శ్రీకాకుళం జిల్లా జీరుపాలెం గ్రామంలో కాంగ్రెస్ భూస్వామి మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు గతంలో మత్స్యకారుల భూమి 75 ఎకరాలు ఆక్రమించుకొన్నాడు. అదితిరిగి తమకు కావాలని ఆందోళన చేసిన మత్స్యకారులమీద దాడిచేయించి, 187 ఇండ్లను తగులబెట్టించాడు. సీతమ్మ అనే స్త్రీ తగలబడి చనిపోయింది. పశ్చిమగోదావరి జిల్లా గూట్లపాగులో గ్రామ రాజకీయాలలో దళితులు అగ్రకులాల పెత్తనాన్ని సాగనివ్వడం లేదన్న కోపంతో దళితులలో చైతన్యవంతులయిన యువకుల మీద దాడిచేసి యేబును, సుందరరావును దారుణంగా చంపారు. రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో భూస్వామి తనకు అమ్మినట్టే అమ్మి వేరేవాళ్లకు తిరిగి అమ్మాలని చూసిన భూమిని తనకే స్వాధీనం చేయాలని పట్టుబట్టిన ఎరుకల వెంకటయ్యను భూస్వామి మనుషులు ఈడ్చుకొని పోయి కొట్టి సజీవంగా దహనం చేసి 'మంత్రగాడు కాబట్టి చంపాం' అన్నారు. అనంతపురం జిల్లా కొత్తపూల వాండ్ల పల్లిలో అగ్రకుల భూస్వాములకు ఎదురుతిరిగి మాట్లాడే స్వతంత్రస్వభావులయిన హరిజన కుళ్లాయప్పను భూస్వాముల మనుషులు చితకబాది మంటలలో వేసి సజీవంగా దహనం చేసారు. తూర్పుగోదావరి జిల్లా వేట్లపాలెంలో దళితులు చెరువు గర్భం భూమి దున్నుకొన్నారని ఆగ్రహించిన పెత్తందార్లు పెద్ద ఎత్తున దాడిచేసి దాదాపు 90 ఇండ్లు తగలబెట్టారు. ధ్వంసం చేసారు. కృష్ణా జిల్లా చిల్లకల్లు ఎస్.ఐ. అయిన ఆత్మగౌరవం గల దళిత యువకుడు చిట్టిబాబు సి.ఐ. తనను కుల పరంగా నిందించడం, కించపరచడం సహించలేక ఆత్మహత్య చేసుకొని చనిపోతే ప్రభుత్వం ఇప్పటిదాకా సి.ఐ.ని అరెస్టు చేయలేదు.

పై సంఘటనలన్నిటి మీద మనం నిజనిర్ధారణ కమిటీలు వేసా. చినకాద, కస్పగదబ వలస, రెడ్డిపల్లి, చారాలవాండ్లపల్లి, పులివెందుల, కంచికచర్ల, వేట్లవాలెం, సంఘటనలపై స్థానికంగా సభలూ సమావేశాలూ నిర్వహించాము. ముఖ్యంగా జీరుపాలెం, వేట్లపాలెం, పులివెందుల దాడుల విషయంలో బాధితులకు చాలా దూరం అండగా నిలబడ్డాం. వేట్లపాలెం, జీరుపాలెం బాధితులకు విప్లవ పార్టీల అండకూడా వుంది. పులివెందుల ఎరుకల వారికి మట్టుకు పౌరహక్కుల సంఘమేఅండ. వాళ్ల విషయంలో కడపజిల్లా శాఖ ప్రశంసనీయమైన కృషి చేసింది. ఆ కృషి ఫలితంగా కడప జిల్లాలోని ఎరుకల యానాది తెగలు పౌరహక్కుల సంఘాన్ని తమ సంస్థగా భావిస్తున్నాయి.

అయితే ఈ దాడుల విషయంలో మనం చేయవలసిన కృషి ఇంకా చాలా వుంది. బాధితులకు ధైర్యం కలిగించడానికి వాళ్లకు అండగా నిలబడాలి. వాళ్ల పోరాటానికి సంఘీభావం తెలపాలి, దాడి చేసిన వాళ్లమీద సరయిన కేసు పెట్టేంత వరకు పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి తేవాలి. బాధితులు ధైర్యంగా సాక్ష్యం చెప్పేట్టు చూడాలి. బాధితులకు వాళ్లపై దాడిచేసిన పెత్తందార్లుగాని, ప్రభుత్వం గాని నష్టపరిహారం చెల్లించేట్లు చూడడం కూడా మన బాధ్యత. ఇందులో మనం కొద్ది భాగం మట్టుకే చేస్తున్నాం. పైన చెప్పినట్టు జీరుపాలెం, వేట్లపాలెం, పులివెందుల కేసులలో ఈ కర్తవ్యాన్ని కొంత మేరకు నిర్వహించాము. కాని మిగిలిన కేసులలో ఎక్కువ చేయలేకపోయాము. ఇక మీదట ఈ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపాలి. సమాజంలో ఏ రకమైన ఆసరాలేని దళిత వర్గాలు చాలా ఉన్నాయి. షెడ్యూల్డు కులాలు, అడవి ప్రాంతంలో బతికే గిరిజనులు ఎంతో కొంత సంఘటితంగా ఉండగలుగుతున్నారు. కాని

ఎరుకల, యానాది, వడ్డెర, దొమ్మరి, వంటి కులాలు, మైదాన ప్రాంతాల గిరిజనులు చాలా నిస్సహాయస్థితిలో ఉన్నారు.

## రిజర్వేషన్ల సమస్య

1986లో మురళీధరరావు కమీషన్ సూచనలనుఅమలు చేయడానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించుకున్నప్పుడు అగ్రకులాల నుండి తీవ్రమైన ప్రతిఘటన వచ్చింది. అప్పుడు మనం తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంటూ ఉన్నప్పటికీ రిజర్వేషన్లను సమర్థిస్తూ మాట్లాడాము. నిర్బంధం వల్ల కొంత, సమగ్రమైన అవగాహన లేకపోవడం వల్ల కొంత, రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను గట్టిగా ప్రతిఘటించలేక పోయాము. తిరిగి 1990 లో దేశవ్యాప్తంగా మండల్ కమీషన్ వ్యతిరేక ఆందోళన చెలరేగినపుడు మనం ప్రచారస్థాయిలో గట్టిగా పనిచేశాం. వరంగల్ లో సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన డాక్టర్ రామనాథం గారి ఐదో వర్థంతి సభతో మొదలుపెట్టి రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలలోను రిజర్వేషన్లకు అనుకూలంగా సభలు నిర్వహించాం. రిజర్వేషన్ వ్యతిరేకులు చేస్తున్న వాదనలను, రిజర్వేషన్లపట్ల కోర్టుల వైఖరిని విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ, రిజర్వేషన్లు దళితుల ప్రజాస్వామిక హక్కు' అనే పుస్తకాన్ని ప్రచురించాం. కృష్ణా జిల్లా శాఖ ఈ ప్రచురణను చేపట్టింది. ఆతర్వాత 1985 లో వసంతకుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్నాటక కేసులో జస్టిస్ చిన్నపరెడ్డి వెలిబుచ్చిన వివరమైన అభిప్రాయాలను తెలుగులోకి అనువాదం చేసి అనంతపురం జిల్లా శాఖ ప్రచురించింది.

రిజర్వేషన్లను మనం నిరుద్యోగ సమస్యకు సంబంధించిన విషయంగా కాక కుల సమస్యకు సంబంధించిన విషయంగా అర్థం చేసుకుంటున్నాం. కులవ్యవస్థ మన దేశంలోని అప్రజాస్వామిక సామాజిక వ్యవస్థల్లో ఒకటి. దానినిపూర్తిగా పెళ్లగించి వేయడం ప్రజాతంత్ర ఉద్యమ కర్తవ్యం. ఆ పోరాటంలో దళితులు సాధించిన ఒకానొక హక్కు రిజర్వేషన్లు. దానికి వ్యతిరేకంగా వచ్చే కోర్టు తీర్పులనైనా, చట్టాలనైనా, సైద్ధాంతిక ప్రచారాలనయినా గట్టిగా వ్యతిరేకించడం మన కర్తవ్యం. భారత రాజ్యాంగం ఈ విషయాన్ని కొంత సందిగ్ధంగా వదిలేసింది. కాబట్టి అధికరణం 15.4. ను సవరించి బాలాజీ కేసు నుండి సుప్రీంకోర్టులో నడుస్తున్న తర్జనభర్జనలకు తావు లేకుండా కులం ప్రాతిపదికపైన రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధం చేయాలని మన ప్రచారంలో భాగంగా డిమాండ్ చేశాం.

## అంటరానితనం

గత రాష్ట్ర మహాసభలలోను అంతకు ముందు అనంతపురం లో జరిగిన అధ్యయన తరగతులలోను అంటరానితనం సమస్యను ఒక ప్రధానమైన పౌరహక్కుల సమస్యగా తీసుకొని పనిచేయాలని నిర్ణయించుకున్నాం. పౌరహక్కుల అవగాహన గురించి చర్చించినప్పుడు, వివరించినట్టు మనుషులను సమగ్రమైన మానవులుగా ఎదగకుండా ఆటంకపరచే సామాజిక వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడడం పౌర హక్కుల ఉద్యమ కర్తవ్యాలలో ఒకటి. అయితే చాలా విషయాలలో లాగ అంటరానితనం విషయంలో కూడ తీసుకున్న నిర్ణయం తీసుకున్నట్టే ఉండిపోతోంది. ఒక్క చిత్తూరుజిల్లా శాఖ మట్టుకే ఈ విషయంలో గణనీయమైన కృషిచేస్తూ వుంది. అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రచారం, పాదయాత్రలు, తదితరకార్యక్రమాలను చిత్తూరు జిల్లాలోని కొన్ని సంస్థలు దాదాపు సంవత్సరకాలంగా ఐక్యంగా నిర్వహిస్తున్నాయి. మన చిత్తూరు జిల్లాలోని కార్యకర్తలు వాళ్లతో కలిసి చాలా కృషి చేశారు. అంటరానితనం ఒక్క చిత్తూరు జిల్లాలోనే కాక రాష్ట్రమంతటా ఏదో ఒక మేరకు అమలవుతూనే ఉంది. కాబట్టి అన్ని జిల్లా శాఖలు ఈ ఉద్యమాన్ని చేపట్టాలి.

## స్త్రీల సమస్య

అంటరానితనం లాగే స్త్రీల సమస్యలవిషయంలో కూడ నిర్ణయానికి ఆచరణకు చాలా తేడా ఉంటోంది. ఒక్క వరకట్న మరణాలనే తీసుకున్నా దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని గణాంకాలు చెపుతున్నాయి. మనం మట్టుకు వాటికి అన్నిటికంటే తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. గత రెండు సంవత్సరాలలో మనం మొత్తం 109 నిజనిర్ధారణ కమిటీ రిపోర్టులను స్వేచ్ఛలో ప్రచురించాం. అందులో 8 మట్టుకే వరకట్న మరణాల మీద రిపోర్టులు, పోలీసు కస్టడీలో హత్యలు, పోలీసుకాల్పుల్లో మరణాలు, 'ఎన్‌కౌంటర్ల' విషయంలో మనం మినహాయింపు లేకుండా అన్ని సంఘటనలమీద రిపోర్టులు సేకరిస్తాం కాని పోలీసు కస్టడీలో లైంగిక అత్యాచారాల విషయంలో మట్టుకు మనకు తెలిసి కూడా రిపోర్టులు సేకరించని సందర్భాలు చాలా వున్నాయి. నిజానికి వరకట్నం వేధింపులు, వరకట్నం మరణాలు, లైంగిక అత్యాచారాలకు సంబంధించిన చట్టాలు గత దశాబ్దకాలంలో చాల మెరుగయ్యాయి. వాటిని పట్టుదలగా అమలు చేస్తే పరిస్థితి ఎంతో కొంత మెరుగవుతుంది. వాటిని అమలు చేయించడానికి పోలీసు యంత్రాంగం మీద, కోర్టుల మీద ఒత్తిడిపెట్టే బాధ్యత పౌరహక్కుల ఉధ్యమం సహజంగా స్వీకరించవలసిన బాధ్యత. మనం అందులో చాలా వరకు విఫలమయ్యాం.

విశాఖపట్నం జిల్లా శాఖ గత ఐదు సంవత్సరాలుగా ఆ జిల్లాలో నమోదయిన వరకట్నం మరణాల కేసులను వివరంగా పరిశీలించి నివేదికలను ప్రచురించింది. అణచివేతను అరికట్టడానికి ఉద్దేశించబడ్డ చట్టాలపట్ల కోర్టులకు, పోలీసు యంత్రాంగానికి ఎంతటి ఉదాసీనవైఖరి ఉందో ఆ నివేదికలు స్పష్టంగా ఋజువుచేస్తాయి. ఆ నివేదికలను అనుసరించి అటువంటి పరిశీలన ఇతర జిల్లాలలో కూడా చేపట్ట వలసిందిగా చాలాసార్లు సూచించడం జరిగింది. కాని ఎవ్వరూ పాటించడం లేదు. ప్రతి వరకట్నం మరణం విషయంలోను ఆందోళన చేయలేక పోయినా కనీసం ఈ రకమైన నివేదికలు తయారు చేయడం మన సామర్ధ్యాన్ని మించిన పని కాదు.

## నక్సలైటు ఉద్యమంపై నిర్బంధం

ఎన్‌కౌంటర్లే కాక ఇతర రూపాలలో కూడా విప్లవోద్యమంపై నిర్బంధం ఎప్పటిలాగే కొనసాగుతోంది. గ్రామాలపై దాడులు, అరెస్టులు, అక్రమకేసులు, చిత్రహింసలు కొనసాగుతున్నాయి. చిత్రహింసలలో కరెంట్ షాక్ ఇవ్వడం అనే కొత్త పద్ధతి ఈ మధ్య పోలీసులు చాలా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఈ అణచివేత కార్యక్రమంలో సాధారణ శాంతి భద్రతల పోలీసు యంత్రాంగమే కాక స్పెషల్ టాస్క్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్ (గ్రే హౌండ్స్) కేంద్ర రిజర్వు పోలీసు, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు, ఇండో టిబెటన్ సరిహద్దు దళం,పొరుగు రాష్ట్రముల స్పెషల్ పోలీసులు పాల్గొంటున్నారు. పోలీసు బలగాల సంఖ్య ఎంతయిందంటే ఒకరొకరు గుర్తు పట్టలేక కాల్పులు జరుపుకుని మొన్న సిర్పూరులో ఇద్దరు చనిపోయారు.

'నక్సలైట్ సమస్య శాంతిభద్రతల సమస్య కాదు. సామాజికార్థిక సమస్య' అని, పోలీసు యంత్రాంగం బూటకపు ఎన్‌కౌంటర్లు తదితర చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడడానికి వీల్లేదని ఇప్పుడిప్పుడు రాజకీయ నాయకులు, పైస్థాయి పోలీసు అధికారులు ప్రకటించడం నేర్చుకుంటున్నారు. ఈమాత్రం ఒప్పుకోవడానికి వాళ్లకు చాలా ఏళ్లు పట్టింది. ఇందులో నిజాయితీ ఎంతఉన్నా లేకున్నా ఈ గుర్తింపును ముందుకు తీసుకుపోవడం మన కర్తవ్యం. అందుకే మనల్ని రాష్ట్రప్రభుత్వం చర్చలకు పిలిచినపుడు ఏ షరతులూ విధించకుండా చర్చల్లో పాల్గొన్నాం. నక్సలైట్ ఉద్యమం సామాజిక, ఆర్థిక, మూలాలను వివరించాం. ఇప్పటిదాక దాన్ని అణచడం పేరిట ప్రజల మీద ప్రయోగించిన అణచివేత చర్యలను ఏకరువుపెట్టాం. ఈ అణచివేతను తక్షణం నిలిపివేసి ఆ ఉద్యమంతో ప్రజాస్వామికంగా వ్యవహరించడం మొదలుపెట్టాలని సూచించాం. అణచివేతకు సంబంధించి నిర్దిష్టంగా కొన్ని డిమాండ్లు పెట్టాం. ఎన్‌కౌంటర్లు ఆపేయాలనీ, ఇప్పటికిజరిగిన అన్ని ఎన్‌కౌంటర్ల మీద న్యాయ విచారణ జరిపించాలని, అక్రమంగా ప్రజలమీద బనాయించిన కేసులను ఎత్తివేయాలని, వాక్ సభా స్వాతంత్ర్యాలను రాజకీయ స్వేచ్ఛను గౌరవించాలని , టాడా, నాసా లాంటి చట్టాలను ఉపయోగించకూడదని డిమండ్ చేసాం. తెలుగుదేశం ప్రభుత్వం చర్చలకు పిలిచినపుడు మౌఖికంగా చెప్పిన ఈ విషయాలనే చెన్నారెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీకి లిఖిత పూర్వకంగా అందించి దానిని ఒక బహిరంగ లేఖగాఅచ్చువేశాం. ఆర్నెల్ల తర్వాత పరిస్థితిలో మౌలికమైన మార్పేమి రాక పోవడం గమనించి పౌరహక్కుల పునరుద్ధరణ ఏమయిందని ప్రశ్నిస్తూ మరొక బహిరంగ లేఖను ప్రచురించాం. ఈ రెండు బహిరంగలేఖలూ ఇంగ్లీషులో అచ్చువేశాం. ఈ మహా సభల సందర్భంగా ఈ రెండు బహిరంగ లేఖల సారాంశాన్ని ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని వివరిస్తూ తెలుగులో 'తుపాకి రాజ్యం' అనే పుస్తకాన్ని ప్రచురించాం.

ఈ నిర్బంధానికి నిరసనగా ప్రచారం చేపట్టాలని ఈ మధ్య నిర్ణయం తీసుకుని హైదరాబాదు, నెల్లూరు,గుంటూరు జిల్లాల్లో బహిరంగసభలు నిర్వహించాం. ఈ రాష్ట్ర మహాసభల తర్వాత ఈ ప్రచారాన్ని కొనసాగించాలి. నక్సలైట్ సమస్య ప్రస్తావన వచ్చినప్పుడల్లా వాళ్లుచేస్తూ ఉన్న హింస మాటేమిటి అనే ప్రశ్న వస్తూ ఉంది. సంస్థలో కూడ ఇది పలుమార్లు చర్చకు వచ్చింది. ఈ విషయంలో ఎవరి అభిప్రాయాలు ఎట్లా ఉన్నా పౌరహక్కుల సంఘం గతంలో దీన్ని చర్చించి ఒక ఖచ్చితమైన నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయాన్ని మరొకసారి గుర్తుచేయాలి. ప్రభుత్వ యంత్రాంగం, ఇతర పెత్తందారీ శక్తులు బలహీనుల మీద ప్రయోగించే అణచివేత పౌరహక్కుల సమస్య. తక్కినదేదీ పౌరహక్కుల సమస్య కాదు. ప్రజలు, ప్రజలసమస్యల పరిష్కారం కోసం ముందుకొచ్చే ఉద్యమాలు చేపట్టే చర్యల మంచిచెడులను తీర్మానించడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యం కాదు. వాళ్లు నేరాలు చేస్తే శిక్షించడానికి చట్టం నిర్దేశించిన ఒక పద్ధతి ఉందని, ఆ పద్ధతిని అతిక్రమించడానికి వీల్లేదని, అసలు ఏ నేరానికైనా అల్లర్లకైనా మూలం సామాజిక సంక్షోభంలో ఉంటుందనీ, దానిని సవరించడం నిజమైన పరిష్కారమార్గమనీ ప్రభుత్వానికి గుర్తుచేయడం పౌర హక్కుల ఉద్యమం కర్తవ్యం. ఇదిసాధారణ అవగాహన దీనికి ఒక సవరణను మట్టుకు చేయాలని మనం నిర్ణయించుకున్నాం. ఒక రాజకీయ ఉద్యమం ప్రభుత్వాన్ని లొంగదీసుకోవడం కోసం లేక డిమాండ్ల సాధనకోసం సామాన్య ప్రజానీకం ప్రాణాలకు ప్రత్యక్షంగా హాని కలిగించే చర్యలకు పాల్పడితే దానిని వ్యతిరేకిస్తాం. అంతే తప్ప ప్రజా ఉద్యమాలు అనుసరించే పద్ధతుల తప్పొప్పుల మీద తీర్పుచెప్పే కర్తవ్యం పౌరహక్కుల సంఘానిది కాదు.

నిర్బంధాన్ని గురించి మనం చేపట్టే ప్రచారంలో ఎన్‌కౌంటర్లు, 'టాడా' కేసులు, చిత్రహింసలు, వాక్ సభాస్వాతంత్ర్యాల మీద, రాజకీయస్వేచ్ఛలమీద పెడుతున్న ఆంక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్‌కౌంటర్ల గురించి ఇప్పటికే వివరించాం. టాడా మాటకొస్తే ఆ చట్టాన్ని మన రాష్ట్రంలో దుర్వినియోగం చేస్తున్నంతగా బహుశా వేరే ఎక్కడా చేయడంలేదేమో. గిరిజనులమీద, రైతుకూలీల మీద, కార్మికులమీద,చివరకు జర్నలిస్టుల మీదకూడా టాడా కేసులు పెడుతున్నారు. తెలుగుదేశం హయాంలో 'టాడా' కింద మొత్తం నాలుగేళ్ళలో పెట్టినన్ని కేసులు చెన్నారెడ్డి హయాంలో తొమ్మిది నెలలలోనే పెట్టారు. ఇప్పుడు మరింత ఎక్కువ సంఖ్యలో పెడుతున్నారు. 1990 లో మొత్తం ఆరు వేల మందిని నక్సలైట్ కార్యకర్తలను, సానుభూతి పరులను అరెస్టు చేసినట్లు డి.జి.పి. స్వయంగా ప్రకటించారు. ఇప్పుడు కూడా అరెస్టులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వీళ్లలో ఎక్కువ మంది మీద టాడా కేసులే పెడుతున్నారు. "కిడ్నాప్‌లు, బస్సు దహనాలు, హత్యలు చేసేవాళ్లను అరెస్టు చేయవద్దా? అని డి.జి.పి. అడుగుతున్నారు. నిజంగా నేరాలు చేసిన వాళ్లను అరెస్టు చేయవద్దని ఎవరూ అనడంలేదు. టాడా వంటి అప్రజాస్వామికమైన

చట్టాన్ని వినియోగించవద్దని అంటున్నాం. అంతేకాక అత్యధికంగా అరెస్టవుతున్నది నేరాలు చేసినవాళ్లకాదు. సానుభూతిపరులు, మీటింగులకు హాజరయిన వాళ్లు, ప్రజా కోర్టుల్లో పాల్గొన్నవాళ్లు, భూస్వాముల మిగులు భూములను ప్రభుత్వ భూములను దున్నుకొన్నందుకు రాష్ట్రంలో కొన్ని వేల మంది మీద 445 ఐ.పి.సి. కింద కేసులు పెట్టారు. వీరిలో చాలామంది మీద టాడా కూడా పెట్టారు. నర్మెట్టలో ధర్నాలో పాల్గొన్నందుకు 348 మంది మీద టాడా పెట్టారు. ఈ అక్రమాలను వ్యతిరేకిస్తున్నాంతప్ప శాంతి భద్రతల నిర్వహణ చట్టబద్ధంగా చేయొద్దనడం లేదు. నక్సలైట్ సానుభూతిపరులమీదే కాక రాయలసీయ ముఠా కక్షల ముద్దాయిల మీద హైదరాబాద్ లో మతఘర్షణల ముద్దాయిల మీద టాడా కేసులు పెడుతున్నారు. ఆ ముఠాల నాయకులు, ఈమత ఘర్షణలు చేయించే వాళ్ల రాష్ట్రంలో ప్రముఖ రాజకీయ నాయకులు. వాళ్లు సుఖంగానే ఉన్నరు. కాని వాళ్ల తరపున కక్షలలో, ఘర్షణలలో పాల్గొనే జనం మట్టుకు టాడా కేసుల్లో జైలుకు పోతున్నారు. మొత్తం టాడా కేసుల ముద్దాయిల సంఖ్య రాష్ట్రంలో పదివేలకు చేరకుంటుంది.

వాక్ సభా స్వాతంత్ర్యాల మీద, భావప్రకటనా స్వేచ్ఛ మీద రాష్ట్ర ప్రభుత్వం దాడి విస్తృతంగా జరుపుతోంది. బహిరంగ సభలు, ధర్నాలు, ఊరేగింపులు జరుపుకునే హక్కుగాని, సంఘాలు పెట్టుకునే హక్కుగాని ప్రజలకు ఇవ్వాళ లేకుండా పోయాయి. పీపుల్స్‌వార్ గ్రూపు కిడ్నాప్‌లు చేస్తోందని ప్రభుత్వయంత్రాంగాన్ని, ఆర్టీసీని, లారీ యజమానులను బెదిరించి మీటింగులకు విద్యుత్, రవాణా తదితర సౌకర్యాలు డిమాండ్ చేస్తోందని పోలీసులు వాదించారు. అందువల్లే మీటింగులకు అనుమతిఇవ్వడం లేదని అన్నారు. కాని నిజానికి ఒక్క పీపుల్స్ వార్ గ్రూప్‌కే కాక ప్రజల పక్షాన రాజీ లేకుండా నిలబడే వారికి కూడ ప్రజాస్వామిక కార్యక్రమాలకు అనుమతి ఇవ్వడం లేదు.ఒక దశలో వరుసగా తిరుపతిలో ఒ.పి.డి.ఆర్ సభను, విశాఖపట్నంలో పౌరహక్కుల సంఘం సభను, చిల్లకల్లులో దళిత సంస్థల సభను భగ్నం చేశారు. అదే పరిస్థితి ఈ నాటికీ కొనసాగుతోంది. పీపుల్స్ వార్ గ్రూపుమీద నెపం పెట్టి మొత్తం గానే ప్రజాస్వామిక హక్కులు నిరాకరిస్తున్నారు. చట్ట వ్యతిరేకమైన ఒత్తిడి పెట్టి మీటింగుకు వసతులు కల్పించమని డిమాండ్ చేసే ఆ ఒత్తిడికి లొంగనవసరం లేదు. కాని మీటింగుకి అనుమతి నిరాకరించడానికి అది కారణం కాజాలదు .అధికరణం లోని భావప్రకటనాస్వేచ్ఛకు ఈ రకమైన మినహాయింపు లేదు. అసలు పరిపాలనా యంత్రాంగం ప్రజాస్వామిక హక్కులను గౌరవించి, పాలకపార్టీలకు ఏ సౌకర్యాలు కల్పిస్తుందో అందరికీ నిష్పాక్షికంగా కల్పించేట్టయితే ఈ సమస్యలే రావు.

ఎన్నికల సమయం దగ్గరికి వస్తోంది కాబట్టి ఈ సందర్భంలో మరో విషయం కూడా చెప్పాలి. నక్సలైటు ఉద్యమాన్ని రాజకీయంగా ఎదుర్కోక పోలీసుబలంతో ఎదుర్కోవడం అనే వైఖరిలో భాగంగా నక్సలైటు గ్రూపులు ఎన్నికలలో పాల్గొన్నా, ఎన్నికలను బహిష్కరించినా పోలీసు యంత్రాంగమే ప్రధానప్రత్యర్థిగా పనిచేస్తోంది. వాళ్లు పాల్గొన్నచోట వాళ్లకు ఓటేస్తే చంపేస్తామని ప్రజలను తంతున్నారు. సిరిసిల్లలో అప్పుడే ప్రథమ బెదిరింపుగా 'ఎన్‌కౌంటర్లు' ప్రారంభ మయ్యాయి. వాళ్లు ఎన్నికలను బహిష్కరించేచోట ఎవరో ఒకరికి ఓటేయ్యకపోతే చంపేస్తామని తంతున్నారు. ఎన్నికలలో పాల్గొనే హక్కయినా, బహిష్కరించే హక్కయినా, రాజకీయపక్షాలకు, ప్రజలకు ఉందనే వాదనతో మనం మొదటి నుండి ఈ దాడులను వ్యతిరేకిస్తున్నాం.

చివరిగా చిత్రహింసల గురించి కొన్ని మాటలు చెప్పాలి. గతంలో లాగ వందల సంఖ్యలో పోలీసు క్యాంపులు పెట్టి జనాన్ని హింసించేబదులు ఇప్పుడు గ్రామాలమీద మెరుపుదాడులు చేసి జనాన్ని మూకుమ్మడిగా కొడుతున్నారు, హింసిస్తున్నారు.అరెస్టు చేసినవాళ్లమీద కరెంట్ షాక్ వంటి తీవ్రమైప చిత్రహింసలు ప్రయోగిస్తున్నారు. టాడా కేసు పెడతామని బెదిరించి లంచాలు తీసుకుంటున్నారు. టాడా కేసులూ పెట్టి జైలుకు పంపిస్తున్నారు.

## ఇతర సమస్యలు

### కాశ్మీర్ సమస్య

కాశ్మీర్‌లో ప్రజలపైన నిర్బంధం జనతాదళ్ హయాంలో చాలా పెరిగింది. రాజకీయ సమస్యలను శాంతి భద్రతల సమస్యలుగా చూడమని , వాటిని స్వార్ధ ప్రయోజనాల కోసం ఉపమోగించుకోమని, వాటి మూలాలను పరిశీలించి పరిష్కరిస్తామని 1989 ఎన్నికలలో జనతాదళ్ నాయకులు వాగ్దానం చేశారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పంజాబ్‌లో అందుకు భిన్నంగా ప్రవర్తించిందని విమర్శపెట్టారు. కాని అధికారానికి వచ్చిన త్వరలోనే సరిగ్గా అదే విధంగా తామూ కాశ్మీర్‌లో ప్రవర్తించడం మొదలుపెట్టారు. కాశ్మీర్ భారతదేశంలో విలీనమైన పరిస్థితులను, ఆర్టికల్ 370 ఆవశ్యతకను, ప్రజాభిప్రాయ సేకరణ గురించి నెహ్రూ ఇచ్చిన వాగ్దానాన్ని, ఆ తర్వాత షేక్ అబ్దుల్లాను రెండు దశాబ్దాలు పైగా జైలులో పెట్టి ఆర్టికల్ 370 లో హామీ ఇచ్చిన స్వయం ప్రతిపత్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్‌ను లోబరుచుకున్న వైనాన్ని వివరించి చెప్పకుండా కాశ్మీర్ సమస్య మొత్తం పాకిస్తాన్ ఏజెంట్లయిన ముస్లిం మతోన్మాదుల వేర్పాటువాద విచ్ఛిన్నకర కార్యకలాపంగా చిత్రీకరించి సైన్యాన్ని దింపి పెద్ద ఎత్తున అణచివేతకు పాల్పడ్డారు. ఈ అణచివేత వివరాలను ఢిల్లీకి చెందిన పౌరహక్కుల సంస్థలు బయటపెట్టాయి. కాశ్మీర్ సమస్య పూర్వాపరాలను, అణచివేత వివరాలను తెలియజేస్తూ కాశ్మీర్ గురించి ఆలోచిద్దాం అనే శీర్షికతో మనం ఒక పుస్తకం ప్రచురించాం.పి.యు.సి.ఎల్. నివేదికను కూడ ఇంగ్లీషులో ప్రచురించాం. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య గురించి మీటింగ్‌లు పెట్టి ప్రచారం చేశాం. షేక్ అబ్దుల్లాకు సన్నిహితుడు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జమ్ము అండ్ కాశ్మీర్ అఫైర్స్ డైరెక్టర్ అయిన ప్రొ. బలరాజ్ పూరిగారిని ఆహ్వానించి, నిజామాబాద్, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరులలో ఉపన్యాసాలను నేర్పాటుచేశాం.

## కాలుష్యం

వాతావరణ కాలుష్యాన్ని పౌరహక్కుల సమస్యగా చేపట్టాలని మనం నిర్ణయం తీసుకొని చాలాకాలమైంది. కాని ఆచరణ అరకొరగా మాత్రమే ఉంది. నాగార్జున సాగర్ వద్ద ప్రభుత్వం తలపెట్టిన అణువిద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ 1988 లో మనం కొంత ఆందోళన చేపట్టాం. ఇతర ప్రజాస్వామిక సంస్థలతో కలిసి ఒక ఐక్య కార్యాచరణ కమిటీని కూడా ఏర్పాటుచేశాం. ఆతర్వాత ఆందోళన మట్టుకు కొనసాగించలేదు. అప్పట్లో ప్రాజెక్టు మంజూరుకాక ప్రభుత్వం ఆగిపోయింది. కాని సూత్రప్రాయంగా అణువిద్యుత్ కేంద్రాన్ని గురించి ఆలోచన మానుకోలేదు. నాగార్జునసాగర్ వద్దనేకాక శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కోస్తా ప్రాంతంలో కూడా ప్రాజెక్టు స్థలాన్ని సర్వేచేసి ఉంచారు. శ్రీకాకుళంలో భూమిని సేకరించే కార్యక్రమం కూడా ప్రారంభమయింది. కాబట్టి మనం తిరిగి ఆందోళనను ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

పారిశ్రామిక కాలుష్యాన్ని గురించి అక్కడక్కడ కొంత ఆందోళన చేస్తున్నాం. విశాఖపట్నం జిల్లా శాఖ హిందూస్థాన్ జింక్ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని గురించి ఆ ప్రాంతంలో చాలా ప్రచారంచేసింది. వీధిమీటింగులు, సెమినార్లు నిర్వహించింది. కేసు వేద్దామని నిర్ణయం తీసుకుని రెండు సంవత్సరాలయింది. కాని అమలు కాలేదు. కృష్ణాజిల్లా శాఖ హనుమాన్ జంక్షన్ సమీపంలోని డిస్టిలరీ ఫ్యాక్టరీ వల్ల వస్తున్న కాలుష్యాన్ని గురించి స్థానికంగా ప్రజలలో ప్రచారం చేసి, అఫిడవిట్ లు సేకరించి, కోర్టులో కేసు వేసింది. సివిల్ దావాయే కాక సి.ఆర్.పి.సి. 133 క్రింద ఆర్డీవో విచారణ కూడా జరుగుతోంది. చిత్తూరు జిల్లా శాఖ చిత్తూరు పట్టణంలోని పారిశ్రామిక కాలుష్యాన్ని గురించి విస్తృతంగా ప్రచారం చేపట్టింది. ఆర్డీవో దగ్గర పిటీషన్ వేసి విచారణ జరిపిస్తోంది. కడప జిల్లా శాఖ ఎర్రగుంట్ల సమీపంలోని మూడు సిమెంట్ ఫ్యాక్టరీల కాలుష్యాన్ని గురించి రెండు సంవత్సరాల క్రితమే ప్రాథమిక సమాచారం సేకరించింది. అయితే నల్గొండ, కృష్ణా జిల్లా లోని సిమెంట్ ఫ్యాక్టరీల కాలుష్యాన్ని గురించి కూడా సమాచారం సేకరించి అన్నీ కలిపి కేసు వేద్దామని నిర్ణయం తీసుకున్నాం. అది కూడా అమలుకాలేదు. హైదరాబాద్ పరిసరాల్లోని కాలుష్యాన్ని గురించి ఆందోళన చేస్తున్న సి.ఎ.పి.తో మనం మొదటి నుండి సత్సంబంధాలు పెట్టుకున్నాం.

ఈ విషయంలో మనం ఇంకా చేయవలసింది చాలా ఉంది. ప్రజల్లో ప్రచారానికి, కోర్టు కేసులకు కూడా చాలా అవకాశం ఉంది.

## ఏనుగులు, పులులు

ప్రభుత్వం, పెత్తందార్లు ప్రత్యక్షంగా ప్రయోగించే అణచివేత కాక ప్రభుత్వ యంత్రాగం నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ అనుసరించే అప్రజాస్వామిక అభివృద్ధి విధానాల వల్ల ప్రజల జీవితానికి, జీవనానికి కలిగే హానిని కూడా మనం పౌరహక్కుల సమస్యగానే భావిస్తున్నాం. చిత్తూరు జిల్లా కుప్పం, పలమనేరు తాలూకాలలో గత ఆరేళ్లుగా ప్రజలను చంపుతూ, పంటలను ధ్వంసంచేస్తూ ఒక అడవి ఏనుగుల మంద స్వైరవిహారం చేస్తోంది. అడవులు చాలా వేగంగా నాశనమవుతున్న కారణంగా ఈ ఏనుగులు తమ స్వస్థలాలను వదిలిపెట్టి ఈ ప్రాంతానికి వచ్చాయి. వాటి బారి నుండి ప్రజలను కాపాడడానికి గాని, వాటివల్ల కలిగిన నష్టానికి సరియైన పరిహారం ఇవ్వడానికి గాని ప్రభుత్వం ఎట్టి ఆసక్తి చూపని పరిస్థితిలో మన చిత్తూరు జిల్లా శాఖ ఈ సమస్యలో ఆసక్తి తీసుకుని దాదాపు నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తోంది. నక్సలైటు ఉద్యమం మీద నిర్బంధాన్ని మినహాయిస్తే మనం ఇంతగా పనిచేసిన సమస్య ఏదీ లేదనుకుంటాను. హైకోర్టులో కేసు కూడా వేసాం. అది విచారణకు వచ్చింది. ఈ సమస్యను వివరిస్తూ ఈ రాష్ట్రమహాసభల సందర్భంగా చిత్తూరు జిల్లా శాఖ 'చిత్తూరు జిల్లాలో ఏనుగుల ప్రభుత్వం' అనే పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించింది.

మహబూబ్ నగర్, కర్నూల్, ప్రకాశం, గుంటూర్, నల్గొండ జిల్లాలో విస్తరించివున్న నల్లమల అడవులలో కేంద్రప్రభుత్వం ఒక పులుల అభయారణ్యాన్ని రూపొందించింది. ప్రపంచంలో పడిపోతున్న పులుల జనాభాలను కాపాడడం దీని లక్ష్యం. ఆ లక్ష్యంతో ఎవరికీ పేచీలేదు కాని పెరుగుతున్న పులుల జనాభావల్ల పరిసర గ్రామాల్లో నివసించే ప్రజల జీవితానికి, జీవనానికి జరుగుతున్న అపారనష్టం మట్టుకు సహించరానిది. పులులు మనుషులను చంపుతున్నాయి, పశువులను చంపుతున్నాయి. పులుల భయంవల్ల ప్రజలు అడవిలో పనులు చేసుకోవడానికి పోలేకుండా ఉన్నారు. మహబూబ్ నగర్ జిల్లా శాఖ ఆ జిల్లాలోని అభయారణ్యంలో పర్యటించి ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని గురించి వివరాలు సేకరించింది. అభయారణ్యం ప్రధానంగా వుండేది మహబూబ్ నగర్, కర్నూల్ జిల్లాల్లో. కాబట్టి కర్నూలు జిల్లా శాఖ కూడా చొరవ తీసుకుంటే మొత్తంగా ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని గురించి వివరాలు సేకరించవచ్చు. అభయారణ్యాన్ని ప్రజలకు నష్టం కలిగించని చోటుకు తరలించాలనే డిమాండ్ తో ఆందోళన చేపట్టాలి.

## మతోన్మాదం

అవగాహన గురించి మొదట్లో ఇచ్చిన వివరణలో చెప్పినట్లు రాజకీయ జీవితంలోను, సామాజిక వ్యవస్థలోను ప్రజాస్వామిక విలువలను కాపాడడం పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యాలలో ఒకటి. ఈ విలువలు శతాబ్దాల ప్రజాతంత్ర పోరాటాల ఫలితం. లౌకికవాదం ఈ విలువల్లో ఒకటి. సామాజిక వ్యవస్థలో మతతత్వం దేశంలో చాలాకాలంగా వుంది. అది ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే అప్రజాస్వామిక సామాజిక వాతావరణాన్ని కల్పిస్తుంది. రాజకీయాల్లోనూ మతతత్వాన్ని ఒక సాధనంగా చాలాకాలం నుంచి వాడుకుంటున్నారు. కాని ఈమధ్య కాలంలోనే అది ఒక బలమైన రాజకీయశక్తిగా తయారయ్యే పరిస్థితి కనిపిస్తోంది. భారతీయ జనతా పార్టీ బాహాటంగానే లౌకిక వాదాన్ని తిరస్కరించి రాముని పేరిట ఎన్నికలలో నిలబడుతోంది. దీని వల్ల కలిగినవిద్వేష పూరితమైన వాతావరణాన్ని వాడుకోవడానికి ఇతర పార్టీలు కూడా వెనుకాడడం లేదు. హైదరాబాద్ లో ఈ మధ్య మతం పేరిట

జరిగిన ఘర్షణల్లో కాంగ్రెస్ అసమ్మతి వాదులు నిర్వహించిన ప్రధానమైన పాత్ర ఎవరికీ తెలియంది కాదు. ఒక ముఖ్యమంత్రిని దించడం కోసం హత్యలకు పాల్పడడానికివాళ్ళు వెనుకాడలేదు. దేశంలో పెరిగిన మతోన్మాద వాతావరణం వారికి దోహదం చేసింది 1990 లో 690 మంది దేశమంతటా మతంపేరిట జరిగిన ఘర్షణల్లో చనిపోయారని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. మతోన్మాద సమస్య దేశంలో ఎంత తీవ్రరూపం తీసుకుందో దీనివల్ల తెలుస్తుంది.

ఏ మతతత్వమయినా అప్రజాస్వామికమైనదే. అన్నిరకాల మతతత్వాన్ని మనం వ్యతిరేకిస్తాం. అదే సమయంలో మైనారిటీల అస్థిత్వానికీ సామాజిక సాంస్కృతిక వికాసానికీ అవసరమయిన సమాన అవకాశం ఉండాలనేది ఒక హక్కుగా డిమాండ్ చేస్తాం. అయితే భారతదేశంలో హిందూమతతత్వం నుండి ప్రధానంగా ప్రమాదం ఉంది కాబట్టి దాని మీద దృష్టి కేంద్రీకరించి మనం ప్రచారం చేపట్టాలి. చాలా జిల్లా యూనిట్లు బహిరంగ సభలు నిర్వహించాయి. జంటనగరాల శాఖ సెమినార్ కూడ నిర్వహించింది. ఇదిముందుముందు మరింత తీవ్రం కాబోయే సమస్య కాబట్టి మనం వివిధ రూపాల్లో ఆందోళనను కొనసాగించాలి.

## సామాజిక సమస్యలు

స్పష్టమయిన పౌరహక్కుల సమస్యలే కాక అనేక సామాజిక అన్యాయాలకు సంబంధించిన సమస్యలు కూడ మన జిల్లా శాఖలు చేపట్టవలసిన పరిస్థితి ఏర్పడుతూఉంది. బలవంతులు బలహీనుల మీద ప్రయోగించే అణచివేత మాత్రమే మన పరిధిలోకి వస్తుందని ఖచ్చితమయిన నియమం పెట్టుకున్నా, చాలా సమస్యలే చేపట్టవలసి ఉంటుంది. మనకు సాధ్యమయిన మేరకు చేపడుతూ వున్నాము. ఈ మధ్య కొత్తగా ఏర్పడిన జిల్లా యూనిట్ల పాత యూనిట్లు కంటే ఎక్కువగా ఈ రకమయిన సమస్యల మీద పనిచేస్తున్నాయి. ఒకటి రెండు చోట్ల మనకు సాధ్యం కాని భారం మీద వేసుకున్నప్పుడు హెచ్చరించడం కూడ జరిగింది.

## నిర్మాణం

ప్రజాస్వామ్య హక్కుల సంస్థ ఎఫ్. డి. ఆర్. మన సంస్థలో విలీనం కావడం ఈమధ్య కాలంలో నిర్మాణపరంగా ప్రధానమయిన హర్షనీయమయిన పరిణామం. మన నిర్మాణంకంటే మనం చేసే పని ఎక్కువ. మనం చేసే పనికంటే మనకు ఉన్న పరపతి ఎక్కువ అనే పరిస్థితి ముందు నుండి ఉన్నదే. ఈ విషయంలో మౌలికంగా మార్పులేకపోయినా గత రెండేళ్లలో నిర్మాణం మెరుగయిందనే చెప్పుకోవచ్చును. చాలాకాలం స్తబ్దంగా ఉన్న వరంగల్, నల్గొండ, తూర్పుగోదావరి, మహబూబ్‌నగర్, కర్నూల్ జిల్లా శాఖలను పునర్‌వ్యవస్థీకరించాం. ఇందులో వరంగల్, మహబూబనగర్ శాఖలు చాలా వేగంగా నిర్మాణం పెంచుకుని చురుకుగా పని చేస్తున్నాయి. కర్నూలు జిల్లా శాఖ నిర్మాణం ఇంకా పెరగవలసి ఉంది. పనిచేస్తూనే ఉన్నా నిర్మాణం సరిగా లేని గుంటూరు జిల్లా శాఖ ఐదవ మహాసభను 1990 ఏప్రిల్ 27వ తేదీన జరిపి ఎన్నికలు నిర్వహించాం. నిర్మాణరీత్యా చాలాకాలం స్తబ్దంగా ఉన్నప్రకాశం జిల్లా శాఖను పునర్‌వ్యవస్థీకరించాలని గత రాష్ట్ర మహాసభలలో తీసుకున్న నిర్ణయాన్ని ఈ రెండేళ్లలో అమలు చేయలేదు. గత రాష్ట్ర మహాసభలప్పటికి కొత్తగా ఏర్పడిన కడప, శ్రీకాకుళం జిల్లా శాఖలు ఈ రెండేళ్లలో చాలా వేగంగా ఎదిగాయి. ప్రజలలో మంచి గుర్తింపు పొంది పని చేస్తున్నాయి. విజయనగరం జిల్లాశాఖ మటుకు ఎదగలేదు. కన్వీనర్ మజుందార్ గారి మరణంతో ఇప్పుడు ఆ శాఖను కూడ పునర్‌వ్యవస్థీకరించవలసిన అవసరం ఏర్పడింది. ఒకరిద్దరు మాత్రమే పనిచేస్తూ వుండిన అనంతపురం జిల్లాశాఖ కూడ ఎక్కువ మంది కార్యకర్తలను సంపాదించుకొని కొంత సంఘటితంగా పనిచేస్తోంది. చిత్తూరు జిల్లా శాఖ ఎప్పటిలాగే వైవిధ్యంగల సమస్యలను చేపట్టి చురుకుగా పనిచేసోంది. జంటనగరాల శాఖ , కృష్ణా జిల్లా శాఖలు బాగా పనిచేస్తున్నాయి. కాని వాటి ప్రాముఖ్యం దృష్ట్యా ఇంకా చేయవలసింది చాలా ఉంది.

విశాఖపట్నం జిల్లా శాఖ నిర్మాణరీత్యా మెరుగయింది. పశ్చిమ గోదావరి, నిజామాబాద్, రంగారెడ్డి, నెల్లూరు, జిల్లాశాఖలు ఎప్పటిలాగా కొనసాగుతున్నాయి. ఇంకొంచెం చురుకుగా పనిచేయవలసిన అవసరం వుంది.

ఇప్పుడు మనకు మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో తప్ప అన్ని జిల్లాల్లోను యూనిట్లు ఉన్నాయి. ఈ మూడు జిల్లాల్లో కూడ పనిచేయడానికి చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఎన్‌కౌంటర్ల మీద నిజనిర్ధారణ కమిటీలు వచ్చినప్పుడు టి.ఎల్.ఎన్. రెడ్డి కమిషన్ కోసం సాక్ష్యాలను సేకరించడానికి ఈ జిల్లాల్లో చాలా మంది సహాయం చేశారు. అయితే ఈ జిల్లాల్లో అమలవుతూ ఉన్న నిర్బంధం దృష్ట్యా బాధ్యతలు స్వీకరించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ మహాసభల సందర్భంగా కనీసం కరీంనగర్ జిల్లా శాఖనయినా పునరుద్ధరించాలని ఆశించాం. కాని అది ఎంత వరకు నెరవేరుతుందో అనుమానమే.

ఈ రెండేళ్లలో మనం మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ జిల్లాశాఖలను పునర్‌వ్యవస్థీకరించడమే కాక మొత్తంగా తెలంగాణా జిల్లాల్లో తిరిగి పనిచేయడం హర్షించదగ్గ విషయం. మొట్టమొదటిసారిగా గత సంవత్సరం డాక్టర్ రామనాథంగారి వర్ధంతి సభను వరంగల్‌లో, జాపాలక్ష్మారెడ్డి గారి వర్ధంతి సభను కరీంనగర్‌లోను జరిపాం. డాక్టర్ రామనాథం గారి స్మృతి లో వరంగల్‌లో ఒక మెమోరియల్ హాల్ నిర్మించాలని నిర్ణయించుకుని దానికోసం విశాలమైన కమిటీని ఏర్పాటుచేశాం. రాష్ట్రవ్యాప్తంగా విరాళాల కోసం తిరుగుతున్నాం. కరీంనగర్ జిల్లా అల్గునూరులో జాపాలక్ష్మా రెడ్డి గారికి ఒక స్థూపం నిర్మించాలని కూడా నిర్ణయించుకున్నాం. దానికోసం ఒక కమిటీ వేసి పనిప్రారంభించవలసి ఉంది.

( అయిపోయింది )